ముంబైలో పోటాపోటీ నిరసనలు..



మిగతా 3లో..

బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం -3, అక్టోబర్ - 2026
balagamtv100@gmail.com
పేజీలు-8

రాష్ట్రంలో భారీగా పెరిగిన ఆటో ఛార్జీలు




వివరాలు 2లో..

# రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

- 19,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు
- కరవు పరిస్థితులపై ప్రతిపక్షాలు ఆనందం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా



హైదరాబాద్, అక్టోబర్ 02 : తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రజలకు నిరంతరాయంగా సరఫరా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. కరెంట్ కష్టాలు తలెత్తకుండా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం, నల్గొండలోని తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్లకు పైగా విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సుమారు ఐదు గంటల పాటు విద్యుత్, కరవు పరిస్థితులపైనే కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. గతంలో తాను సబ్‌స్టేషన్లలోని లాగ్‌బుక్‌లను తనిఖీ చేసినప్పుడు, కొందరు ఆపరేటర్లు విద్యుత్ సరఫరాలో జరుగుతున్న వ్యత్యాసాలను అంగీకరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. సింగరేణి బొగ్గు లింకేజీ, నైనీ బ్లాక్ మిగతా 3లో..

# జల సంక్షోభం దిశగా రాష్ట్రం!?

- పడిపోయిన భూగర్భ జలాలు
- తాగునీటి సమస్య జటిలం
- తుడిచిపెట్టిన వానాకాలం..
- అడుగంటిన జలాశయాలు



హైదరాబాద్, అక్టోబర్ 02 : వానాకాలం వెళ్లిపోయింది. కానీ తెలంగాణలో నీటి టెన్షన్ మొదలైంది. ఎల్ నినో ప్రభావంతో ఈసారి వానలు ఆశించినంతగా పడలేదు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు రాష్ట్రంలో సాధారణంగా పడాల్సిన వానతో పోలిస్తే 17 శాతం లోటు నమోదైంది. 33 జిల్లాల్లో ఏకంగా 18 జిల్లాలు వర్షాభావంలోనే ముగిశాయి. దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాష్ట్రం మొత్తానికి లెక్క వేస్తే వాన కొంత పడినట్టే కనిపిస్తుంది. కానీ పల్లెకు వెళ్లి చూస్తే అసలు కథ తెలుస్తుంది. ఒక చోట వాన పడితే, మరోచోట చినుకు కూడా సరిగ్గా పడలేదు. ఒక్క చెట్టు నీడతో అడవి చల్లబడుతుందా అన్న తీరులో కొన్ని ప్రాంతాల్లో పడిన వాన రాష్ట్రం మొత్తం లోటును పూడ్చలేకపోయింది. 2023లో తెలంగాణలో 861 మి.మీ. వర్షం పడింది. అది సాధారణం కంటే 17 శాతం ఎక్కువ. ఇప్పుడు మాత్రం సాధారణ వర్షపాతం కంటే 17 శాతం లోటు నమోదైంది. రెండేళ్లలోనే వాన లెక్క తలకిందులైంది. ఇక అసలు చిక్కు నీళ్ల దగ్గర మొదలవుతుంది. సెప్టెంబర్ 30 నాటికి కృష్ణా, గోదావరి పరిధిలోని తెలంగాణ రిజర్వాయర్లలో కలిపి సుమారు 503 టీఎంసీల నీరు ఉంది. గత ఏడాది ఇదే సమయానికి ఈ నిల్వ 835 టీఎంసీలకు పైగా ఉంది. అంటే ఏడాదిలో దాదాపు 331 టీఎంసీల తేడా కనిపిస్తోంది. కృష్ణా బేసిన్‌లో ఈసారి 323 టీఎంసీలకు పైగా నీరు ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 583 టీఎంసీలకు పైగా ఉంది. గోదావరి బేసిన్‌లోనూ ఈసారి సుమారు 180 టీఎంసీలు ఉంటే.. గత ఏడాది 252 టీఎంసీలకు పైగా నిల్వ ఉంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ లెక్కలు చూస్తే నీటి కొరత మరింత స్పష్టంగా కనిపిస్తోంది. శ్రీశైలంలో గతేడాది 153.56 టీఎంసీలు ఉంటే.. ఈసారి 61.65 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. నాగార్జునసాగర్‌లో గతేడాది 174.25 టీఎంసీలు ఉంటే.. ఈసారి 44.89 టీఎంసీలకు పడిపోయింది. తెలంగాణలో మిగతా 3లో..

# ఉక్కు మహిళ నిర్మలా సీతారామన్

- ఇంటిని చక్కదిద్దుతున్నట్లు దేశాన్ని నిర్మల తీర్చిదిద్దుతున్నారు
- ఆమె నాయకత్వ పటిమను గుర్తించే ఆర్థిక శాఖ అప్పగింత
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసలు
- ఈ పరిశ్రమతో కరవుసీమ ఇకపై కనకసీమగా మారుతుంది
- సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారు

మూడేళ్లలో 36 ప్రాజెక్టులు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం

- మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ శంకుస్థాపనలో చంద్రబాబు
- గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన

వివరాలు 4లో..

# కొడంగల్‌లో సభ పెడతాం

- రేవంత్ కు చెమటలు పట్టిస్తాం
- ఖైరతాబాద్ లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం
- తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు



హైదరాబాద్, అక్టోబర్ 02 : తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు మరింత తీవ్రమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోనే భారీ బహిరంగ సభ నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాల్ విసురుతామని బీఆర్ఎస్ ప్రకటించింది. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "కొడంగల్‌లో మేము పెట్టబోయే సభతో ముఖ్యమంత్రికి చెమటలు పట్టిస్తాం" అని ఆయన హెచ్చరించారు. సిద్దిపేటలో సీఎం రేవంత్ రెడ్డి సభ ముగిసిన తర్వాత కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ ఉంటుందని తలసాని స్పష్టం చేశారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గమైన సిరిసిల్లలో సభ నిర్వహించడాన్ని ఆయన ప్రస్తావించారు. సిరిసిల్ల ఏమైనా పక్క రాష్ట్రంలో ఉందా? అని ప్రశ్నిస్తూ... సిరిసిల్లలో బలప్రదర్శన చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఆ సభ వల్ల సీఎంకు రాజకీయంగా నష్టమే జరిగిందని అన్నారు. ఇదే సందర్భంగా, ఖైరతాబాద్ ఉపఎన్నికపై తలసాని పూర్తి ధీమా వ్యక్తం చేశారు. ఆ ఎన్నికలో బీఆర్ఎస్ వందకు వంద శాతం గెలుస్తుందని జోస్యం చెప్పారు. పార్టీ మారిన దానం నాగేందర్‌పై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, ఈసారి ఓటింగ్ శాతం కూడా పెరుగుతుందని అన్నారు. డబ్బులు ఇచ్చినా ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయరని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ నుంచి తమ పార్టీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడాన్ని కూడా తలసాని తప్పుబట్టారు. సభలో తాము చేయని దానికి, బయట జరిగిన వివాదానికి స్పీకర్‌కు ఏం సంబంధమని ఆయన ప్రశ్నించారు.

# విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్..

- రాష్ట్రవ్యాప్తంగా సెంట్రల్ కిచెన్ల ఏర్పాటు
- డిసెంబర్ 9 నుంచి ప్రభుత్వ స్కూళ్లలో అమలు
- సరికొత్త కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం
- కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంస్థల సాయం
- నిత్యం 25 లక్షల మందికి పౌష్టికాహార టిఫిన్
- పలు సంస్థలతో సీఎం సమక్షంలో ఒప్పందం



హైదరాబాద్, అక్టోబర్ 02 : తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని విస్తరించనుంది. డిసెంబర్ 9వ తేదీన అన్ని జిల్లాల్లో సెంట్రల్ కిచెన్స్ సేవలను ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ బృహత్తర కార్యక్రమం ద్వారా ప్రతిరోజూ 25 లక్షల మందికి పైగా విద్యార్థులకు ఉదయం వేళ బలవర్ధకమైన, పరిశుభ్రమైన అల్పాహారం లభిస్తుంది. నవంబర్ 30 నాటికి వంటశాలల నిర్మాణ పనులన్నీ పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఆహార నాణ్యత, పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఈ కిచెన్లను హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానిస్తారు. పిల్లలకు అందించే ఆహారంలో ఉండే క్యాలరీల స్థాయిని ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా రోజువారీగా ట్రాక్ చేస్తారు. స్థానిక ఆహారపు అలవాట్లను గౌరవిస్తూనే సంపూర్ణ పోషకాలతో కూడిన మెనూను ఖరారు చేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించే బృహత్తర ప్రాజెక్టు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు అధికారిక ఒప్పందం కుదుర్చుకున్నాయి. నాగర్‌కర్నూల్ సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణం కోసం జున్నా సోలార్ సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబు రూ. 5.17 కోట్ల చెక్కును అందించారు. వికారాబాద్ వంటశాల కోసం చైన్ ల్యాబ్స్ మిగతా 3లో..

# మహాత్ముడి నిజమైన వారసులు బీజేపీయే

- గాంధీ ఆశలను నెరవేరుస్తున్న మోదీ
- గాంధీ ఆరాధించిన రాముడు ధనికుల దేవుడా
- ఓటమి తర్వాత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితం
- ఖైరతాబాద్ ఉపఎన్నికలో బీజేపీని గెలిపిస్తాం
- హిందూ ఓట్లను ఏకం చేసి గెలిచితీరుతాం



వివరాలు 4లో..

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై బండి సంజయ్ ఫైర్

# సర్ విచారణ మీ ఇంటి వద్దకే..

- కొత్త మార్గదర్శకాలు జారీ చేసిన ఈసి
- ఓటుకు భద్రత కల్పించేలా నిర్ణయం



హైదరాబాద్, అక్టోబర్ 01 : తెలంగాణా రాష్ట్రంలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై భారత ఎన్నికల సంఘం తాజా మార్గదర్శకాలను ఇచ్చింది. ఈ మేరకు ఓటర్లకు నష్టం జరగకుండా, ఇబ్బంది కలగకుండా వారి ఓటుకు భద్రత కల్పించేలా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎస్ఐఆర్ 2026 ప్రక్రియను ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి తాజాగా జిల్లా కలెక్టర్లను ఆదే శించారు. సీఈఓ సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లను నోటీసులు అందు కోవడానికి లేదా అవసరమైన పత్రాలు సమర్పించడానికి కార్యాలయాలకు పిలవరాదని స్పష్టం చేశారు. బూత్ లెవల్ అధికారులు ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజే యడంతో పాటు, అవసరమైన పత్రాలను వారి ఇళ్ల వద్దే స్వీకరించాలని సూచించారు. ఇకపై సాధారణంగా ఓట ర్లను విచారణ కోసం కార్యాలయాలకు పిలవరాదని సీఈ ఓ తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో విచారణ నిర్వహిం చాల్సి వస్తే ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్త ఓటరు నమోదు కోసం ఫారం-6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ తప్పనిసరిగా ఉండాలని సీఈఓ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ నిర్వహించని రాష్ట్రాల్లో డిక్లరేషన్ మిగతా 3లో..

# ఇన్‌సర్వీస్ టీచర్లకు గుడ్ న్యూస్

- స్పెషల్ టెట్ నోటిఫికేషన్ విడుదల
- నవంబరు 16 నుంచి ఆన్‌లైన్ పరీక్షలు
- అక్టోబర్ 7 నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తు

హైదరాబాద్, అక్టోబర్ 02 : తెలంగాణలో ప్రస్తుతం విధుల్లో కొనసాగుతున్న ఇన్ సర్వీస్ టీచర్లకు ముఖ్యమైన అప్డేట్ వచ్చింది. వీరి కోసం ప్రత్యేకంగా నిర్వహించే 'టెట్-2' పరీక్షకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రత్యేక ఉపాధ్యాయ అర్హత పరీక్షకు అర్హులైన టీచర్ల నుంచి ఈ అక్టోబర్ 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా అప్లికేషన్లను స్వీకరించనున్నట్లు విద్యాశాఖ తెలిపింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు, టెట్ కమిటీ ఛైర్మన్ నవీన్ నికోలస్ గురువారం (అక్టోబర్ 1న) అధికారిక ప్రకటన విడుదల చేశారు. పాఠశాల విద్యాశాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. టెట్ ఆన్‌లైన్ పరీక్షలను నవంబరు 16 నుంచి 21వ తేదీ వరకు మిగతా 3లో..

# ముంబైలో పోటాపోటీ నిరసనలు..

- సీజేపీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్స్ట్' ఆందోళన
- సీఈసీ రాజీనామా డిమాండ్ చేస్తూ సీజేపీ ఆందోళన
- పోటాపోటీ ప్రదర్శనలతో ముంబైలో ఉద్రిక్తత
- భారీగా మోహరించిన పోలీసులు, భద్రతా బలగాలు

వివరాలు 3లో..

# గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి

- గాంధీ ఆశయాలతోనే మా పాలన
- వివక్ష లేని సమాజ నిర్మాణమే లక్ష్యం
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

## గాంధీ భవన్‌లో గాంధీ జయంతి వేడుకలు



హైదరాబాద్, అక్టోబర్ 02 : గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతిపిత మహాత్మా గాంధీకి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళులర్పించారు. గాంధీజీ ఆశయాల స్ఫూర్తితోనే రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, వివక్ష లేని సమాజ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గాడ్సే భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను వక్రీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో మిగతా 3లో..

# మొబైల్ దొంగిలించాడనే అనుమానంతో వ్యక్తి హత్య

హైదారాబాద్, అక్టోబర్ 02 : మొబైల్ ఫోన్ దొంగిలించాడనే చిన్న అనుమానం ఓ వ్యక్తి ప్రాణాలను బలిగొంది. ఎలాంటి నిర్ధారణ లేకుండానే ఓ వ్యక్తిపై మూకుమ్మడిగా దాడి చేసి హత్య చేసిన దారుణ ఘటన వెల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. ఈ కేసులో ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా.. న్యాయస్థానం వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 27న వినాయక చవితి సందర్భంగా అన్నదానం కార్యక్రమం జరుగుతున్న సమయంలో గుండెని ప్రవీణ్‌కు చెందిన మొబైల్ ఫోన్ కనిపించకుండా పోయింది. దీంతో అతడు ఫోన్ కోసం వెతకడం ప్రారంభించాడు. ఈ క్రమంలో 29న 'ఫైండ్ మై డివైస్' యాప్ ద్వారా ఫోన్ లొకేషన్‌ను ట్రాక్ చేశాడు. యాప్ చూపించిన లొకేషన్ ఆధారంగా వెతకగా.. బ్యాగరి రామానుజానికి చెందిన పొలంలోని రాళ్ల మధ్య ఓ ప్లాస్టిక్ కవరులో మొబైల్ ఫోన్ లభించింది. దీంతో రామానుజమే ఫోన్‌ను దొంగిలించాడనే అనుమానం ప్రవీణ్‌తో పాటు అతని అనుచరుల్లో బలపడింది.ఈ అనుమానంతో కక్ష పెంచుకున్న గుండెని ప్రవీణ్, గుండెని రమేష్, ఎంకమొల్ల రమేష్, గుండెని బాబురావు, నాగని రామానుజం, ఎంకమొల్ల ప్రశాంత్, మాసాని శ్రీను, గుండెని సత్యనారాయణ.. అర్ధరాత్రి సమయంలో బ్యాగరి రామానుజంపై దాడికి పాల్పడ్డారు. చేతులు, కాళ్లతో తన్నడంతో పాటు కర్రలతో రామానుజాన్ని విచక్షణారహితంగా కొట్టినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న రామానుజం భార్య, కుమార్తె అక్కడికి చేరుకుని దాడి చేయొద్దంటూ నిందితులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ వారు వెనక్కి తగ్గకుండా దాడి కొనసాగించినట్లు తెలుస్తోంది. తీవ్రంగా గాయపడిన రామానుజం అక్కడికక్కడే మృతి చెందాడు. అతడిలో ఎలాంటి కదలికలు లేకపోవడాన్ని గమనించిన నిందితులు భయంతో అక్కడి నుంచి పరారయ్యారు.ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తూప్రాన్ సీఐ వెంకటరాజాగౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నాయి. అనంతరం వారిని కోర్టులో హాజరుపరచగా.. న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఈ కేసులో అరెస్టైన వారిలో ఓ మైనర్ బాలుడు కూడా ఉన్నట్లు తూప్రాన్ సీఐ వెల్లడించారు. మొబైల్ ఫోన్ దొంగతనం చేశాడనే అనుమానంతో ఎలాంటి నిర్ధారణ లేకుండానే దాడికి పాల్పడటం, చివరకు ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# రేవంత్, కేటీఆర్ ఆస్తులపై విచారణ జరపాలి

- ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి
- నా ఆస్తిపైనా విచారణకు ఎప్పుడైనా సిద్ధమే
- ఎంపీ రఘునందన్ రావు కీలక వ్యాఖ్యలు



హైదారాబాద్,అక్టోబర్02 : తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల విచారణ సవాళ్లు మరింత ముదు రుతున్నా యి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆస్తులపై సిట్టిం గ్ జడ్జితో విచారణ జరిపిం చాలని బీజేపీ ఎంపీ రఘు నందన్‌రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ ఎస్ పార్టీలలోని నేతలు దొంగలేనని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సంగా రెడ్డి జిల్లా రామచంద్రా పురంలో ఈరోజు మీడియా తో మాట్లాడుతూ ఆయన ఈ వ్యా ఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి, కేటీఆర్ తమ ఆస్తులపై విచారణ కోరుతూ సోమవారం లోగా హైకోర్టుకు లేఖ రాయాలని రఘునందన్ సవాల్ విసిరారు. ఒకవేళ వారు స్పందించకపోతే, తానే స్వయంగా హైకోర్టుకు లేఖ రాస్తానని స్పష్టం చేశారు. అవసరమైతే ముగ్గురం కలిసి సిట్టింగ్ జడ్జికి విచారణ కోసం విజ్ఞప్తి చేద్దామని, తన ఆస్తులపైనా విచారణకు తాను సిద్ధమే నని ప్రకటించారు. ఇటీవల సిరిసిల్ల సభలో కేటీఆర్ ఆస్తుల గురించి సీఎం రేవంత్ రెడ్డి ఆరోపణలు చేయగా, దానికి ప్రతిగా తమ ఇద్దరి కుటుంబాల ఆస్తులపైనా న్యాయ విచారణ జరిపించాలని కేటీఆర్ సవాల్ చేశారు. ఈ సవాళ్లు, ప్రతిసవాళ్ల నేపథ్యంలో ఇప్పుడు బీజేపీ కూడా ఈ అంశాన్ని తెరపైకి తేవడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

# తల్లిపాలు తాగేవారు మనుషులు..

- బిర్యానీ తినేవారు జంతువులు
- హిమంత బిశ్వశర్మ వివాదాస్పద వ్యాఖ్యలు

అస్సాం, అక్టోబర్ 02 : అస్సాం రాజకీయాలు మరోసారి వ్యక్తిగత దూషణలతో వేడెక్కాయి. ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, కాంగ్రెస్ ఎంపీ రకీబుల్ హుసేన్ మధ్య మాటల యుద్ధం తీవ్ర స్థాయికి చేరింది. "తల్లిపాలు తాగడానికి పుట్టినవారు మనుషులు.. బిర్యానీ తినడానికి జన్మించినవారు జంతువులు" అంటూ హిమంత చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో దుమారం రేపుతున్నాయి. నాగావ్ లోక్‌సభ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం జురియాలో జరిగిన సభలో హిమంత ఈ వ్యాఖ్యలు చేశారు. కొన్ని రోజుల క్రితం, హిమంత బిశ్వశర్మ.. రకీబుల్ హుసేన్‌ను పురాణాల్లోని బకాసురుడితో పోలుస్తూ ప్రభుత్వ నిధులను మింగేస్తున్నారని ఆరోపించారు. దీనికి హుసేన్ స్పందిస్తూ, "భగవంతుడు నన్ను బిర్యానీ తినడానికే ఈ భూమి మీదకు పంపాడు" అని సరదాగా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలనే ఉటంకిస్తూ హిమంత పైవిధంగా తీవ్రంగా ప్రతిస్పందించారు. ఈ ఆహార సంబంధిత వాగ్వివాదం సెప్టెంబర్ 28న ప్రారంభమైంది. హుసేన్ పులావ్, మాంసం తినే అలవాట్లను ప్రస్తావిస్తూ హిమంత "బకాసురుడు" అని పోల్చారు. దీనికి హుసేన్ కూడా గట్టిగానే బదులిచ్చారు. "హిమంత బిస్కెట్లు తింటూ పెరిగారు. కాంగ్రెస్‌లో చేరాకే ఆయనకు పులావ్, చికెన్ తెలిశాయి" అంటూ ఎదురుదాడి చేశారు. నాగావ్ లోక్‌సభ స్థానానికి ఈ నెల 6న ఉప ఎన్నిక జరగనుండగా, 9న ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఈ ఎన్నికల ప్రచారంలో హిమంత కాంగ్రెస్, ఏఐయూడీఎఫ్ పార్టీలపైనా విమర్శలు గుప్పించారు. రూపోహిహాట్ నియోజక వర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే నూరుల్ హుదా అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు.ఏఐయూడీఎఫ్‌నేత బద్రుద్దీన్ అజ్మల్ రాజకీయాల నుంచి తప్పుకోవాలని సూచించారు.

# సంతోషిమాత ఆలయంలో విగ్రహంపై దాడి

**పూజలు చేస్తుండగా విగ్రహాన్ని కొట్టిన ఆగంతుకుడు**

**ఘటనను ఖండించిన బీజేపీ నేతలు, ఆందోళన**



హైదారాబాద్, అక్టోబర్ 02 : హైదరాబాద్‌లోని చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. భవానీ నగర్ కాలనీలోని శ్రీ సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ఉదయం పూజలు జరుగుతుండగా ఒక వ్యక్తి అమ్మవారి విగ్రహంపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో భక్తులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి, ఆందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే, ఆలయంలో పూజలు నిర్వహిస్తుండగా ఒక వ్యక్తి లోపలికి ప్రవేశించాడు. నేరుగా గర్భగుడిలోకి వెళ్లి తన చేతిలోని కర్రలతో విగ్రహంపై దాడి చేయడం ప్రారంభించాడు. ఈ హఠాత్పరిణామంతో భయాందోళనకు గురైన భక్తులు కేకలు వేశారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎల్బీ నగర్ ఏసీపీ రవీంద్ర రెడ్డి నిందితుడిని అదుపులోకి తీసుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆలయ ఛైర్మన్ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడిని మహమ్మద్ అన్సారీగా పోలీసులు గుర్తించారు. అతను కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్నట్లు పోలీసు వర్గాల సమాచారం. నిందితుడు గర్భగుడిలోకి వెళ్లి విగ్రహంపై దాడి చేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు నామమాత్రపు కేసు నమోదు చేశారని ఆరోపిస్తూ రంగారెడ్డి అర్బన్ బీజేపీ అధ్యక్షుడు వాణిపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి తదితరులు దిల్‌సుఖ్‌నగర్ ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. ఆలయాలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఆందోళనకారుల్లో కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతున్నారు.

# రాష్ట్రంలో భారీగా పెరిగిన ఆటో ఛార్జీలు

- కిలోమీటర్‌కు రూ.15 చొప్పున పెంపు
- తొలి 1.6 కిలోమీటర్లకు కనీస ఛార్జీ రూ.30
- పెంచిన ధరలు నేటి నుంచే అమల్లోకి
- లగేజీపై కూడా అదనపు చార్జీలకు అనుమతి
- అధికారికంగా జీవో జారీ చేసిన ప్రభుత్వం

హైదారాబాద్, అక్టోబర్ 02 : ఆటో డ్రైవర్లకు తెలంగాణ ప్రభుత్వ ఊరట కల్పించింది. ఆటో ఛార్జీలను ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు శుక్రవారం రేవంత్ సర్కార్ అధికారికంగా ఒక జీవో కూడా జారీ చేసింది. ఆటోల కనీస చార్జీని రూ.20 నుంచి రూ.30కి పెంచుతున్నట్లు జీవోలో పొందుపర్చింది. ప్రతీ కిలో మీటర్‌కు రూ.11 నుంచి రూ.14కి పెంచుతున్నట్లు ప్రకటించింది. ఇక టిటెన్షన్ చార్జి 50 పైసల నుంచి 75 పైసలకు పెంచగా.. లగేజీ ఛార్జీ 25 పైసల నుంచి 50 పైసలకు పెంచారు. ఇక గరిష్ట లగేజీ పరిమితి 100 కిలోలుగా కొనసాగించారు. ఇక రాత్రి సమయాల్లో ఛార్జీలపై 1.5 రెట్లు కొనసాగించారు. దాదాపు 12 ఏళ్ల తర్వాత ఆటో ఛార్జీలను ప్రభుత్వం సవరించింది.కొత్త ఆటో ఛార్జీల అమలు కోసం మీటర్ల రీసెట్టింగ్‌కు ప్రభుత్వం 3 నెలల గడువు విధించింది. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఒకటిన్నర శాతం అదనపు ఛార్జీలు వసూలు చేసుకునేలా వెసులుబాటు కల్పించింది. మూడు నెలల్లోగా ఆటో డ్రైవర్లు డిజిటల్ మీటర్లను ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఆటో ఛార్జీలను అధికారికంగా ధృవీకరిస్తూ జీవో 46 జారీ చేసింది. ఈ చార్జీలు తక్షణమే అమల్లో వస్తాయని వెల్లడించింది. ఇక ట్రాఫిక్ లేదా ఇతర కారణాల వల్ల ఆటో ఆగినప్పుడు నిమిషానికి 75 పైసలు చొప్పున వెయిటింగ్ ఛార్జీ ఖరారు చేశారు. రాత్రి సమయాల్లో ప్రయాణించేవారు సాధారణ ఛార్జీల కంటే అదనంగా 50 శాతం చెల్లించాల్సి ఉంటుంది. ఇక ప్రయాణికులు ఆటోలో తమ వెంట హ్యాండ్ బ్యాగ్, బ్రీఫ్ కేస్ వంటికి ఉచితంగా తీసుకెళ్లవచ్చు. ఇతర పెద్ద లగేజీలు తీసుకెళ్లాలంటే కిలోమీటర్‌కు 50 పైసలు చొప్పున అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.ఆటోలో తొలి 1.6 కిలోమీటర్లకు కనీస ఛార్జీ రూ.30గా ఫిక్స్ చేశారు. ఆ తర్వాత ప్రతీ అదనపు కిలోమీటర్‌కు రూ.15 చొప్పున ఖరారు చేశారు. ఇక కొత్త ధరలపై ఆటోల్లో ఫేర్ కార్డులను ఏర్పాటు చేయాలని డ్రైవర్లను ప్రభుత్వం ఆదేశించింది. కాగా ఆటో ఛార్జీలను పెంచాలని డ్రైవర్ల సంఘాలు ఇటీవల సమ్మెకు పిలుపునిచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆటోలను నిలిపివేసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. దీంతో ప్రభుత్వం దిగొచ్చి ఆటో సంఘాలతో చర్చలు జరిపింది. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవ దంతో ఆటో డ్రైవర్లు సమ్మెపై వెనక్కి తగ్గారు. ఈ క్రమంలో ఆటో డ్రైవర్లకు ఊరట కల్పిస్తూ ఛార్జీలను ప్రభుత్వం పెంచింది. అలాగే డ్రైవర్ల సంక్షేమ కోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసే పనిలో ప్రభుత్వం ఉంది. అయితే ఛార్జీల పెంపు వల్ల డ్రైవర్లకు ప్రయోజనం చేకూరనుండగా.. సామాన్యులకు భారమనే చెప్పుకోవచ్చు.




# కెప్టెన్ స్మిత్ మచ్చార్‌కు ప్రధాని మోదీ భరోసా!



న్యూఢిల్లీ, అక్టోబర్ 02 : ఫ్లైదుబాయ్ విమానంలో జరిగిన తీవ్ర ఘటనలో ప్రయాణికుల ప్రాణాలను కాపాడేందుకు అసాధారణ ధైర్యం ప్రదర్శించిన భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారు. ఘటన సమయంలో తాను ఎదుర్కొన్న పరిస్థితులను, ఆ సమయంలో తనకు ధైర్యం ఇచ్చిన అంశాలను మచ్చార్ ప్రధానితో పంచుకున్నారు.దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో కో-పైలట్ దాడి చేయడంతో మచ్చార్ తీవ్రంగా గాయపడ్డారు. అయినప్పటికీ పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. కాక్‌పిట్ తలుపు తెరవడంతో ప్రయాణికులు, సిబ్బంది లోపలికి చేరుకుని దాడి చేసిన కో-పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని తబూక్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. విమానంలో ఉన్న 174 మంది సురక్షితంగా బయటపడ్డారు. ఈ సందర్భంగా మచ్చార్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తిని ప్రధాని మోదీ ప్రశంసించారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చిన ఆయనను అభినందిస్తూ.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ప్రస్తుతం మచ్చార్‌ను మెరుగైన చికిత్స కోసం యూఏఈకి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు భారత దౌత్య వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటనపై యూఏఈ, ఇజ్రాయెల్ దర్యాప్తు కొనసాగిస్తున్నాయి. దాడికి దారితీసిన కారణాలు, కో-పైలట్ ఉద్దేశ్యంపై అధికారులు పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. మరోవైపు కెప్టెన్ స్మిత్ మచ్చర్ సాహసంపై ఆయన తండ్రి భూపేంద్ర మచ్చర్ స్పందించారు. విమానం నడపడమంటే తన కుమారుడికి అత్యంత ప్రీతిపాత్రమని, అదే అతని ప్రపంచమని ఆయన పేర్కొన్నారు. ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ ఘటన గురించి తెలిసిన వెంటనే తమ కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతికి, ఆందోళనకు గురైందని భూపేంద్ర తెలిపారు. "తల్లిదండ్రులుగా ఆ వార్త వినగానే మేము ఎంతగానో కలత చెందాం. వెంటనే ఇంట్లో దేవుడి ముందు దీపం వెలిగించి, ఎలాంటి అశుభవార్త వినకూడదని ప్రార్థించాం. ఆందోళనతో గుడికి కూడా వెళ్లాం" అని ఆయన ఆనాటి క్షణాలను గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం స్మిత్ అబుదాబిలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఆయన వెల్లడించారు. ఈ దాడిలో స్మిత్ తల, రెండు చేతులకు తీవ్ర గాయాలయ్యాయని, వైద్యులు ఇప్పటికే శస్త్రచికిత్స చేశారని తెలిపారు. అతను పూర్తిస్థాయిలో కోలుకోవడానికి కొంత సమయం పడుతుందని వైద్యులు వెల్లడించినట్లు పేర్కొన్నారు. తీవ్ర గాయాలతో కాక్‌పిట్ లో కింద పడిపోయినప్పటికీ, ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలనే దృఢ సంకల్పంతోనే స్మిత్ కాక్‌పిట్ తలుపులు తెరిచాడని, తద్వారా విమాన సిబ్బంది, ప్రయాణికులు లోపలికి ప్రవేశించి దాడి చేసిన వ్యక్తిని నిలువరించగలిగారని ఆయన వివరించారు. "దేశం నా కుమారుడిని చూసి గర్విస్తున్నప్పటికీ, ప్రస్తుతం మాకు తన ఆరోగ్యమే అత్యంత ముఖ్యం" అని భూపేంద్ర వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన యువతకు సందేశమిస్తూ, తల్లిదండ్రులను గౌరవించాలని, నిజాయతీగా జీవించాలని, ఎప్పుడూ సత్యం, ధర్మమే విజయం సాధిస్తాయని హితవు పలికారు.

# మెట్రో, ఆర్టీసీ కామన్ పాస్..

**అధికారికంగా ప్రారంభించిన ప్రభుత్వం**

హైదరాబాద్, అక్టోబర్ 01 : హైదరాబాద్ మహానగర పరిధిలోని ప్రయాణీకుల రవాణా అవసరాలను సులభతరం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో ప్రయాణించే పౌరుల కోసం హైదరాబాద్ మెట్రో, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ) సంయుక్తంగా రూపొందించిన ఒకే ఉమ్మడి పాస్‌ను ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించింది. ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారుల సమక్షంలో ఈ నూతన కామన్ పాస్‌ను ఆవిష్కరించారు. ఈ కామన్ పాస్ ఆవిష్కరణ వెనుక ప్రధాన లక్ష్యం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిరాటంకమైన, సులభతరమైన, సమగ్ర ప్రజారవాణా అనుసంధానాన్ని కల్పించడమే. నిత్యం లక్షలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు నగరంలో ప్రయాణాల కోసం బస్సులు, మెట్రో రైళ్లపై ఆధారపడుతుంటారు. ఇప్పటివరకు వేర్వేరుగా టికెట్లు లేదా పాస్‌లు తీసుకోవాల్సి రావడం వల్ల సమయం వృథా అవ్వడంతో పాటు ఇబ్బందులు ఎదురవుతుండేవి. ఈ కొత్త విధానం ద్వారా ప్రయాణీకులు ఒక్క కార్డుతోనే రెండు రవాణా వ్యవస్థల సేవలను వినియోగించుకోవచ్చు. ప్రయాణీకుల సౌకర్యం కోసం ప్రభుత్వం ఈ కామన్ పాస్‌లలో రోజువారీ, నెలవారీ ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకొచ్చింది. రోజువారీ ఉమ్మడి పాస్ ధరను రూ.400గా నిర్ణయించారు. ఇందులో మెట్రో ప్రయాణ ఛార్జీ కింద రూ.300 , ఆర్టీసీ ప్రయాణ ఛార్జీ కింద రూ.100 వేర్వేరుగా లెక్కించబడతాయి. అలాగే రోజూ ప్రయాణించే వారి కోసం నెలవారీ ఉమ్మడి పాస్‌ను రూ.8,500లకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ నెలవారీ పాస్‌లో మెట్రో వాటా రూ.7,000 కాగా.. ఆర్టీసీ వాటా రూ.1,500గా లెక్కించబడతాయి. ఈ స్మార్ట్ కార్డ్ డిపాజిట్, వినియోగ నిబంధనలకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలను విడుదల చేశారు. ప్రయాణీకులు మొదటిసారి ఈ కార్డును కొనుగోలు చేసేటప్పుడు సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ భవిష్యత్తులో ఈ కార్డు అవసరం లేదనుకుని ఆర్టీసీ లేదా మెట్రో యాజమాన్యానికి తిరిగి ఇచ్చేస్తే ఆ రూ.100 డిపాజిట్ సొమ్మును ప్రయాణీకుడికి తిరిగి వాపసు చేస్తారు. ఈ కామన్ పాస్ వినియోగం లిమిట్స్ విషయానికి వస్తేయ.. ఔటర్ రింగ్ రోడ్(ూ==) పరిధి లోపల నడిచే అన్న రకాల ఆర్టీసీ సిటీ బస్సులతో పాటు మెట్రో రైళ్లన్నింటిలోనూ ప్రయాణించడానికి ఇది వర్తిస్తుంది. సిటీ సాధారణ, ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, మెట్రో డీలక్స్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. అయితే శంషాబాద్ విమానాశ్రయానికి నడిచే ప్రత్యేక ఏసీ బస్సులు అయిన 'పుష్పక్' సర్వీసులకు మాత్రం ఈ పాస్ వర్తించదని అధికారులు స్పష్టం చేశారు. ఈ నూతన ఉమ్మడి పాస్ విధానం వల్ల నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడమే కాకుండా ప్రజారవాణా వినియోగం మరింత పెరుగుతుందని భావిస్తున్నారు.




# బల్లార్షా-గూడూరు మధ్య నాలుగో రైల్వే లైన్

- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్ర రైల్వే శాఖ

హైదారాబాద్, అక్టోబర్ 02 : బల్లార్షా-కాజీపేట-విజయవాడ-గూడూరు మధ్య నాలుగో రైల్వే లైన్ నిర్మాణ పనులు వేగం పుంజుకోనున్నాయి. ఈ ముఖ్యమైన ప్రాజెక్టుకు కేంద్ర రైల్వే శాఖ గురువారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 744.80 కిలోమీటర్ల పొడవైన ఈ లైన్‌తో పాటు ఇందుపల్లి-దుగ్గిరాల మధ్య 36.80 కిలోమీటర్ల డబుల్ లైన్ పనులకు కూడా అధికారిక ఆమోదం లభించింది. ఈ నోటిఫికేషన్‌తో భూసేకరణ ప్రక్రియకు కీలక అడుగు పడింది. ఈ ప్రాజెక్టు దక్షిణ మధ్య రైల్వే పరిధిలో చేపట్టబడుతోంది. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా నుంచి తెలంగాణలోని కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల వరకు ఈ మార్గం విస్తరించి ఉంది. దేశంలో అత్యంత రద్దీగా ఉండే చెన్నై-న్యూఢిల్లీ రూట్‌లో భాగమైన ఈ లైన్ ప్రయాణికులు, సరుకు రవాణా రైళ్లకు పెద్ద ఉపశమనం కలిగిస్తుంది. ఇప్పటికే కాజీపేట-బల్లార్షా, కాజీపేట-విజయవాడ మధ్య మూడో రైల్వే లైన్ పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. నాలుగో లైన్ పూర్తయితే రైళ్ల రద్దీ గణనీయంగా తగ్గుతుంది. రైళ్ల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య కనెక్టివిటీ బలోపేతం అవుతుంది. బొగ్గు, సిమెంట్, ఇనుప ధాతువు వంటి సరుకుల రవాణా కూడా సులభతరం కానుంది. ప్రాజెక్టు కోసం భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైంది. స్థానిక రైతులు, ప్రజలతో సంప్రదింపులు జరపాల్సి ఉంటుంది. పరిహారం, పునరావాసం వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించనున్నారు. ఈ నాలుగో లైన్ పూర్తయితే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతం లభిస్తుంది. ప్రయాణ సమయం తగ్గడంతో పాటు వ్యాపార, పారిశ్రామిక రంగాలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. కేంద్ర రైల్వే శాఖ ఈ ప్రాజెక్టును ప్రత్యేక రైల్వే ప్రాజెక్టుగా గుర్తించి, వేగంగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. గెజిట్ నోటిఫికేషన్ జారీ కావడంతో పనులు మరింత ఉత్సాహంగా సాగనున్నాయి. రద్దీగా ఉండే చెన్నై-న్యూఢిల్లీ రూట్‌లో ఇది ఒక కీలక లైన్ గా మారనుంది.



# ఇకపై అన్ని సబ్జెక్టులకు ప్రాక్టికల్స్!?

**సిలబస్‌తో పాటు మారిన మార్కుల విధానం**

హైదారాబాద్, అక్టోబర్ 02 : తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత విద్యా సంవత్సరం (2026-27) నుంచి ఇంటర్మీడియట్ ఫస్టియర్ విద్యార్థులకు బోర్డు కీలక మార్పులు తీసుకొచ్చింది. చదువుకునే సిలబస్‌తో పాటు పరీక్షల విధానంలోనూ సమూల మార్పులు చేశారు. ఇప్పటివరకు కేవలం కొన్ని సబ్జెక్టులకే పరిమితమైన ప్రాక్టికల్స్‌ను.. ఇప్పుడు అన్ని సబ్జెక్టులకు (ఇంటర్నల్ అసెస్‌మెంట్ రూపంలో) ప్రవేశపెట్టారు. ఈ కొత్త విధానంపై విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది. కొత్త విధానం ప్రకారం మొత్తం మార్కుల్లో రాత పరీక్షకు 80 శాతం, ప్రాక్టికల్స్‌కు 20 శాతం మార్కులను కేటాయించారు. ఒకవేళ ఎగ్జామ్ 80 మార్కులకు ఉంటే, విద్యార్థులు పాస్ కావాలంటే కనీసం 28 మార్కులు (35 శాతం) సాధించాల్సి ఉంటుంది. అలాగే ప్రాక్టికల్స్‌కు కేటాయించిన 20 మార్కులలో కనీసం 7 మార్కులు వస్తేనే పాసైనట్లు లెక్క. సైన్స్ సబ్జెక్టుల విషయానికి వస్తే.. గతంలో కేవలం సెకండియర్‌లోనే ప్రాక్టికల్స్ ఉండేవి. కానీ, ఇకపై ఫస్టియర్‌లో సగం, సెకండియర్‌లో మరో సగం చొప్పున ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ఇంగ్లీష్ సబ్జెక్ట్ విషయంలోనూ బోర్డు స్పష్టతనిచ్చింది. ఫస్టియర్ విద్యార్థులకు ఒకే ఒక పాఠ్య పుస్తకం ఉంటుంది. ఇక సెకండ్ ఇయర్లో టెక్స్ట్ బుక్‌తో పాటు ప్రత్యేకంగా 'ఇంగ్లీష్ ప్రాక్టికల్ మాన్యువల్' కూడా అందుబాటులో ఉంటుంది. ఈ కొత్త మార్పులు, సిలబస్ వివరాలు, సబ్జెక్టుల వారీగా మార్కుల కేటాయింపు వంటి సమస్త సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్ లో పొందుపరిచామని బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ తెలిపారు. ఈ కొత్త పరీక్షా విధానంపై విద్యార్థులకు ఎటువంటి గందరగోళం లేకుండా చూడాల్సిన బాధ్యత కళాశాలల యాజమాన్యాలపై ఉంది. ఏ సబ్జెక్టుకు ఎన్ని మార్కులు ఉంటాయి, పాస్ మార్కులు ఎలా లెక్కగడతారు అనే పూర్తి వివరాలను ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు విద్యార్థులకు చక్కగా అర్థమయ్యేలా వివరించాలని బోర్డు ఆదేశించింది. కాబట్టి విద్యార్థులందరూ ఈ కొత్త విధానాన్ని గమనించి అందుకు తగ్గట్టుగా చదువులో విజయం సాధించాలి.

(మొదటిపేజీ తరువాయి)

## జల సంక్షోభం దిశగా రాష్ట్రం!?

దాదాపు 44 వేల చెరువులు ఉన్నాయి. వాటిలో దాదాపు 40 శాతం చెరువులు పావు వంతు కూడా నిండలేదని ప్రభుత్వం తెలిపింది. చెరువు నిండితే బోరుకు ఊపిరి. చెరువు ఎండితే పల్లెకు కష్టం. చెరువు నిండితే ఊరు నిండినట్టే అనే పాత మాట ఇప్పుడు మళ్లీ గుర్తుకొస్తోంది. చెరువుల్లో నీరు లేకపోతే భూగర్భ జలాలు కూడా పెరగవు. సెప్టెంబర్ చివరి నాటికి రాష్ట్రంలో భూగర్భ జలాల సగటు లోతు 11.24 మీటర్లకు చేరింది. నెల మొదట్లో అది 7.52 మీటర్లుగా ఉంది. అంటే నెల రోజుల్లోనే నీటి మట్టం గణనీయంగా దిగింది. బోరు లోతు పెరిగితే మోటారు ఖర్చు పెరుగుతుంది. డీజిల్‌తో నీళ్లు తోడితే రైతు ఖర్చు మరింత పెరుగుతుంది. వాన కోసం ఆకాశం వైపు, నీళ్ల కోసం బోరు వైపు చూస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో సుమారు 123.74 లక్షల ఎకరాల్లో సాగు జరిగింది. గత ఏడాది ఇదే సమయంలో 139.29 లక్షల ఎకరాల్లో సాగు జరిగింది. అంటే దాదాపు 15.55 లక్షల ఎకరాలు తగ్గాయి. వరి సాగు కూడా గత ఏడాదితో పోలిస్తే దాదాపు 18 శాతం తగ్గింది. నీరు పుష్కలంగా ఉండే పంటల నుంచి తక్కువ నీటితో పండే పంటల వైపు వెళ్లాలని రైతులకు సూచిస్తున్నారు. రైతు పరిస్థితి మాత్రం లెక్కల్లో కనిపించినంత తేలిక కాదు. విత్తనం వేసి పంట పెంచాడు. మధ్యలో వాన ముఖం చాటేస్తే పెట్టుబడి పోతుంది. బోరు నీటితో కాపాడాలంటే మరో ఖర్చు. నీరు అందకపోతే దిగుబడి తగ్గుతుంది. పంట చేతికి రాకపోతే రైతు చేతిలో మిగిలేది అప్పే. ఇక తాగునీటి లెక్క కూడా ఇప్పుడు కీలకంగా మారింది. హైదరాబాద్‌కు నీరు అందించే సింగూర్ వంటి వనరులపై ఒత్తిడి పెరుగుతోంది. సరఫరా కొనసాగుతున్నా రాబోయే నెలల్లో నిల్వలు తగ్గితే ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. అంటే సమస్య రైతు పొలంలోనే కాదు. ఇంటి కుండ దగ్గర కూడా ఉంది. సాగుకు నీళ్లు కావాలి. పల్లెకు తాగునీరు కావాలి. పట్టణాలకు నీరు కావాలి. నీరు తగ్గినప్పుడు ముందు ఎవరి అవసరం తీరాలి అన్నదే అసలు సవాల్. ఇందుకే ప్రభుత్వం ఇప్పుడు ఆల్‌పార్టీ సమావేశానికి సిద్ధమవుతోంది. ఎల్‌నినో ప్రభావం, వర్షాల లోటు, కరువు పరిస్థితులపై అన్ని పార్టీల సలహాలు తీసుకోనుంది. కేబినెట్ సబ్‌కమిటీ కూడా పరిస్థితిని అధ్యయనం చేయనుంది. కానీ పల్లెకు కావాల్సింది సమావేశాలు కాదు. నీళ్లు. రైతుకు కావాల్సింది మాటలు కాదు. పంటకు నీరు. ఇంటికి కుళాయి వస్తుందన్న నమ్మకం కావాలి. బోరు ఎండిపోతుందేమో అన్న భయం పోవాలి. ముందు జాగ్రత్తే మేలు అన్న తీరులో ఇప్పుడు నీటి లెక్క ముందే వేసుకోవాల్సిన సమయం. వానాకాలం ముగిసింది. రిజర్వాయర్లలో నీళ్లు గత ఏడాదికంటే చాలా తక్కువగా ఉన్నాయి. చెరువుల్లో నిల్వలు తగ్గాయి. భూగర్భ జలాలు దిగుతున్నాయి. సాగు విస్తీర్ణం తగ్గింది. వాన తగ్గింది. నీళ్లు తగ్గాయి. ఇప్పుడు ప్రభుత్వానికి అసలు పరీక్ష మొదలైంది. తెలంగాణలో కరువు తలుపు తడుతోందా అన్న ప్రశ్నకు లెక్కలు మాత్రం గట్టిగానే హెచ్చరిస్తున్నాయి. మరోవైపు హైదరాబాద్‌లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. గతేడాది సెప్టెంబరులో జిల్లా సగటు 3.57 మీటర్లు ఉండగా, ఈ ఏడాది 10.01 మీటర్లకు పడిపోయింది. మేడ్చల్-మల్కాజిగిరిలో 11.64 మీటర్లు, వికారాబాద్‌లో 11.96 మీటర్లు, రంగారెడ్డిలో 11.74 మీటర్లు, మహబూబ్‌నగర్‌లో 10.51 మీటర్లు, సంగారెడ్డిలో 11.21 మీటర్ల లోతుకు నీటి మట్టం పడిపోయింది . బోర్లు ఇప్పటికే చుక్క నీరు రాకుండా మారుతున్న ప్రాంతాలు ఉన్నాయి . నగరాల్లోనూ, పల్లెల్లోనూ తాగునీటికి తీవ్ర ఇబ్బందులు మొదలయ్యాయి. ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలు ఆలస్యం కావడం, వర్షపాతం తగ్గడం ఇందుకు ప్రధాన కారణం. రాష్ట్ర సగటు వర్షపాతం 18 శాతం లోటుతో నమోదైంది. నల్గొండ, నిర్మల్, హైదరాబాద్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్ తదితర 19 జిల్లాల్లో తీవ్ర వర్షపాత లోటు నమోదైంది. ఈ ప్రాంతాల్లో భూగర్భ జలాలు అధికంగా అడుగంటాయి. పెద్దపల్లి, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్, జగిత్యాల వంటి కొన్ని జిల్లాల్లో మాత్రమే కొంత మెరుగైన పరిస్థితి కనిపిస్తోంది. అయినా మొత్తంగా రాష్ట్ర పరిస్థితి ఆశాజనకంగా లేదు. వాతావరణ శాఖ ప్రకారం ఇకపై పెద్దగా వర్షాలు రావు. అంటే నేలలోకి ఇంకే నీరు మరింత తగ్గుతుంది. అక్టోబరు నుంచి వచ్చే ఏడాది మే నెల వరకు తాగునీటి సమస్య కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. భూగర్భ జలవనరుల శాఖ డైరెక్టర్ కె.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, నీటిని ప్రతి ఒక్కరు బాధ్యతగా, పొదుపుగా వాడుకోవాలి. వృథాను అరికట్టడం ప్రతి ఒక్కరి కర్తవ్యం అని స్పష్టం చేశారు. జలాశయాలు నిండకపోవడం, చెరువులు ఎండిపోవడం, బోర్లు వట్టిపోవడం ఇవన్నీ కలిసి రాష్ట్రంలో తీవ్ర జల సంక్షోభం ముంచుకొస్తోందని, కనుక నీళ్ళను ఇప్పటి నుండే పొదుపుగా వాడాల్సిన అవసరం స్పష్టమవుతోంది. ప్రజలు, ప్రభుత్వం కలిసి నీటి పొదుపు చర్యలు తీసుకోకపోతే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉంది.

## రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

సమస్యలను సత్వరమే పరిష్కరించి, బొగ్గు సరఫరాను పునరుద్ధరించేలా ప్రత్యేక దృష్టి సారించమన్నారు. నల్గొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి ద్వారా నియోజక వర్గానికి 5,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొనడంపై ప్రతిపక్షాలు రాజకీయానందం వ్యక్తం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్..

ఇండియా ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ రూ. 4 కోట్ల విరాళం చెక్కును సీఎం చేతుల మీదుగా ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్ర దాస్ స్వామీజీకి అందజేశారు. ఈ పథకం ద్వారా విద్యార్థుల శారీరక ఎదుగుదల, చదువులో ప్రగతిని నిరంతరం పరిశీలించడానికి డిజిటల్ హెల్త్ రికార్డులను నిర్వహిస్తారు. పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపాన్ని అరికట్టి పాఠశాలల్లో హాజరు శాతాన్ని గణనీయంగా పెంచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. పరిశుభ్రమైన వాతావరణంలో వేడివేడిగా సిద్ధమయ్యే అల్పాహారాన్ని ప్రత్యేక వాహనాల్లో నేరుగా బడులకు తరలిస్తారు. ఈ మహత్తర కార్యక్రమానికి స్వచ్ఛంద సంస్థలు కూడా పెద్దపీట వేస్తున్నాయి. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో వంటశాలల నిర్మాణం వేగంగా సాగుతోంది. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్ సెంట్రల్ కిచెన్ కోసం రూ. 5.17 కోట్లు, వికారాబాద్ యూనిట్ కోసం రూ. 4 కోట్లు విరాళంగా అందించేందుకు ఆ సంస్థ ముందుకొచ్చింది.

## సర్ విచారణ మీ ఇంటి వద్దకే..

అవసరం లేకపోయినప్పటికీ, తెలంగాణలో కొత్త ఓటర్ల నమోదు సందర్భంగా డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఈఆర్ఓ కార్యాలయాల నోటీసు బోర్డులపై ఫారం-6, ఫారం-7కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ప్రదర్శించాలని సూచించారు. ఓటర్లకు జారీ చేయాల్సిన పెండింగ్ నోటీసులపై కూడా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. ఫారం-6, పెండింగ్ నోటీసులు, ఫారం-7, ఫారం-8కు సంబంధించిన వివరాలను అన్ని స్థాయిల్లోని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎప్పటికప్పుడు అందించాలని సీఈఓ ఆదేశించారు. ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేస్తూ, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతిదశనుపారదర్శకంగాపూర్తిచేయాలని సీఈఓ సి. సుదర్శన్ రెడ్డి సూచించారు. ఇక తాజా ఆదేశాలతో విచారణకు రాని వారి ఇళ్ళకు నేరుగా బీఎల్ వోలు వెళ్లి కావాల్సిన డాక్యుమెంట్స్ తీసుకోవాలని సూచించారు.

## గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి

నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. సత్యం, అహింస, శాంతి మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేసిన గాంధీజీ ఆశయాలు సదా స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా కొనియాడారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గాంధీజీ చూపిన మార్గంలోనే తమ ప్రభుత్వం పయనిస్తోందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా విద్యార్థులందరికీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించాలనే ఉద్దేశంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల'ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వివక్షకు తావులేని సమసమాజ నిర్మాణమే ప్రజా పాలన అంతిమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## ఇన్‌సర్వీస్ టీచర్లకు గుడ్ న్యూస్

వేర్వేరు విడతల్లో నిర్వహించనున్నారు. ఈ స్పెషల్ టెట్ ఫలితాలను డిసెంబరు 9 నుంచి 11వ తేదీల మధ్య విడుదల చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో రెగ్యులర్ విధానంలో విధులు నిర్వహిస్తున్న టీచర్లు తమ ఉద్యోగాల్లో కొనసాగాలంటే 2028 ఆగస్టు నాటికి టెట్ ఉత్తీర్ణత సాధించడం తప్పనిసరి అని సుప్రీం కోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలోనే పాఠశాల విద్యాశాఖ ప్రత్యేకంగా ఇన్ సర్వీస్ టీచర్ల కోసం ఈ స్పెషల్ టెట్ పరీక్షను నిర్వహిస్తోంది.

## తమిళనాడులోనూ మహిళలకు ఫ్రీ బస్సు స్కీమ్

### వెట్రి పయనం పథకం ప్రారంభించిన సీఎం విజయ్

చెన్నై, అక్టోబర్ 02 : తమిళనాడు సీఎం బాధ్యతలు చేపట్టిన విజయ్.. ఎన్నికల్లో ఇచ్చిన ముఖ్యమైన హామీలపై దృష్టి పెట్టారు. రాష్ట్రంలోని మహిళల కోసం ప్రతిష్టాత్మకమైన 'వెట్రి పయనం' (విజయ యాత్ర) పథకానికి శ్రీకారం చుట్టారు. చెన్నైలోని కోయంబేడు బస్ స్టాండ్‌లో అత్యంత వైభవంగా జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం విజయ్ స్వయంగా పాల్గొని ఈ పథకాన్ని ప్రారంభించారు. వెట్రి పయనం పథకం ప్రారంభించిన సీఎం విజయ్ స్వయంగా బస్సులో ప్రయాణించి.. మహిళా ప్రయాణికులకు ఫ్రీ బస్ టికెట్లను ఇచ్చారు. ఈ సందర్భంగా బస్సులో ఉన్న మహిళలు తమ అభిమాన నాయకుడిని చూసి ఉద్వేగానికి లోనయ్యారు. కొందరు యువతులు సీఎం విజయ్‌తో సెల్ఫీలు దిగగా, మరికొందరు చాక్లెట్లు, తమ సమస్యల వినతిపత్రాలను అందజేశారు. బస్సులో కొందరు మహిళలు తన పక్కనే కూర్చోవాలని కోరగా, వారి ఆప్యాయతను మన్నించి వారి మధ్యే కూర్చుని మాట్లాడారు. వృద్ధుల ఆయనను ఆశీర్వదించగా, మరికొందరు కరచాలనం చేసి తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. తమిళనాడు ప్రభుత్వ బస్సుల్లో మహిళలందరూ ఉచితంగా ప్రయాణించేలా ఈ స్కీమ్ ను తీసుకొచ్చింది టీవీకే ప్రభుత్వం. మహిళల ఆర్థిక స్వావలంబనకు, రవాణా సౌకర్యాలను సులువు చేయడానికి ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## ముంబైలో పోటాపోటీ నిరసనలు..

- సీజేపీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్స్ట్' ఆందోళన
- సీఈసీ రాజీనామా డిమాండ్ చేస్తూ సీజేపీ ఆందోళన
- పోటాపోటీ ప్రదర్శనలతో ముంబైలో ఉద్రిక్తత
- భారీగా మోహరించిన పోలీసులు, భద్రతా బలగాలు



ముంబై, అక్టోబర్ 02 : ముంబైలో శుక్రవారం ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఓవైపు నిరసనలు చేపట్టగా, మరోవైపు ఆ పార్టీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్స్ట్ ముంబై' బృందం కౌంటర్ ప్రదర్శన నిర్వహించింది. ఈ పోటాపోటీ ఆందోళనల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గాంధీ జయంతి సందర్భంగా సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త నిరసనలకు సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద, ముంబైలోని శివాజీ పార్క్ పరిసర ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. తమ నిరసనకు ప్రజలు మద్దతు ప్రకటించాలని పార్టీ ప్రతినిధి సౌరవ్ దాస్ విజ్ఞప్తి చేశారు. వీరికి ప్రతిగా జెన్ నెక్స్ట్ ముంబై సభ్యులు అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఒక నిరసనకారుడు మాట్లాడుతూ, "అభిజీత్ దీప్కే వంటి వ్యక్తులు రాజ్యాంగాన్ని అస్థిరపరచాలని చూస్తున్నారు. కానీ రాజ్యాంగాన్ని ఎలా కాపాడుకోవాలో, ఎలా గౌరవించాలో మాకు తెలుసు. అందుకే మేం బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నాం. కాక్రోచ్ జనతా పార్టీ వైఖరిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం" అని స్పష్టం చేశారు. ఈ పోటాపోటీ ప్రదర్శనల ప్రభావంతో సోషల్ మీడియాలోనూ ఇరు వర్గాల మద్దతుదారుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కొందరు జెన్ నెక్స్ట్ మద్దతుదారులు సీజేపీ సభ్యులను 'దిమాగీ నక్సల్స్'గా అభివర్ణించగా, జెన్ నెక్స్ట్ నిరసనల వెనుక బీజేపీ హస్తం ఉందని సీజేపీ వర్గాలు ఆరోపించాయి. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు, భద్రతా బలగాలు భారీగా మోహరిం చాయి. ఓటర్ల జాబితా సవరణ అంశంపై ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా సీజేపీ చేస్తున్న ప్రచారం ఏ స్థాయిలో విభేదాలకు దారితీసిందో ఈ ఘటనలు అద్దం పడుతున్నాయి.

## మహాత్ముడి నిజమైన వారసులు బీజేపీయే

- ఓటమి తర్వాత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితం
- ఖైరతాబాద్ ఉపఎన్నికలో బీజేపీని గెలిపిస్తాం
- హిందూ ఓట్లను ఏకం చేసి గెలిచితీరుతాం
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై బండి సంజయ్ ఫైర్



హైదరాబాద్, అక్టోబర్ 01 : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం గాంధీ జయంతి వేడుకల సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జమ్మికుంటలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గాంధీ వారసత్వం తమదేనని చెప్పుకునే నైతిక అర్హత ఆ పార్టీలకు లేదని ఆయన విమర్శించారు. శ్రీరాముడిని "ధనికుల దేవుడు"గా అభివర్ణించిన కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నిత్యం 'రామ' నామాన్ని జపించిన గాంధీ ఆరాధించిన రాముడు, కేవలం ధనికులకే దేవుడా, లేక ప్రజలందరి దేవుడా? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నేతలను బండి సంజయ్ ప్రశ్నించారు. గాంధీజీ సత్యం, ధర్మం, న్యాయంతో కూడిన సనాతన ధర్మాన్ని పాటించారని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్, వారసత్వ రాజకీయాలు, అవినీతి, హిందూత్వ వ్యతిరేకత విధానాలతో నడిచే "ఇటలీ నేషనల్ కాంగ్రెస్" అని, దీనిని నడిపిస్తున్నది "డూప్లికేట్ గాంధీ కుటుంబం" అని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకే హిందూ సమాజాన్ని విభజించే కుట్రలు చేస్తోందని విమర్శించారు. మరోవైపు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కూడా బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమై గాంధీ, అంబేద్కర్ వంటి జాతీయ నేతల జయంతి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఓటమి అనంతరం ప్రజా జీవితానికి దూరమైన కేసీఆర్, ప్రపంచంలోనే అత్యంత అహంకారపూరిత నాయకుడని దుయ్యబట్టారు. గాంధీ కలలు కన్న రామరాజ్యం, స్వచ్ఛ భారత్ వంటి ఆశయాలను ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం నెరవేరుస్తోందని, గాంధీకి నిజమైన వారసులు తామేనని ఆయన స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికను ప్రస్తావిస్తూ, ఈ ఎన్నిక రావడానికి కాంగ్రెస్ పార్టీయే కారణమని సంజయ్ ఆరోపించారు. ఆ నియోజకవర్గంలోని 2 లక్షల మంది హిందూ ఓటర్లను విస్మరించి, కేవలం 32,000 ముస్లిం ఓట్లపైనే కాంగ్రెస్ ఆశలు పెట్టుకుందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసినా ప్రజలు వారిని తిరస్కరిస్తారని, ఖైరతాబాద్‌లో హిందూ ఓటర్లను ఏకం చేసి బీజేపీని గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. "డబుల్ ఇంజిన్" సర్కారుతోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి సాధ్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## రాష్ట్రంలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోంది

- అవినీతిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పడుతున్నాయి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు
- బీజేపీలో చేరిన పలువ్యురు సీరియల్ నటులు..
- ఆహ్వానించిన బీజేపీ బాస్ రాంచందర్ రావు

హైదరాబాద్, అక్టోబర్ 01 : తెలంగాణలో బీజేపీలో పలువురు టెలివిజన్ సీరియల్ కళాకారులు చేరారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో టీవీ నటి వేములపల్లి స్వర్ణలతతో పాటు మరి కొందరు సీరియల్ నటులు కాషాయ కండువా కప్పుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ... అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆ రెండు పార్టీలు ఒకరిపై ఒకరు అక్రమ సంపాదన ఆరోపణలు చేసుకోవడంలోనే మునిగిపోయాయని, సామాన్యుడు ఏం సంపాదించాడని ఎప్పుడైనా పట్టించుకున్నాయా అని ప్రశ్నించారు. వంద రోజుల్లో బీఆర్ఎస్ అవినీతిని బయటపెడతామని చెప్పిన కాంగ్రెస్, వెయ్యి రోజులు గడిచినా ఒక్కరినీ జైలుకు పంపలేకపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. అవినీతిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయని రాంచందర్ రావు ఆరోపించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద ప్రీమియం చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని, తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులను అరెస్ట్ చేయించిందని మండిపడ్డారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఖరితో ప్రజలు విసిగిపోయారని, రాష్ట్రంలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వినోద రంగంలోని ప్రముఖులను చేర్చుకోవడం ద్వారా పార్టీ బలోపేతానికి బీజేపీ చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ చేరికలు జరిగాయి.

## భారత్‌లో ధర్మం, దేశం వేర్వేరు కాదు

### మోహన్ భగవత్ వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 02 : భారతదేశంలో ధర్మం, దేశం వేర్వేరు కావని, ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానమే పరిష్కారం చూపగలదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన అఖిల భారత విహార్ సేవా గ్రూప్ 14వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా భగవత్ మాట్లాడుతూ, "మన దేశం, ధర్మం పరస్పర భిన్నమైనవి కావు. దేశానికి ధర్మమే ప్రాణాధారం, ధర్మమే దేశాన్ని సుస్థిరపరుస్తుంది. ఈ రెండూ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయి" అని స్పష్టం చేశారు. నేడు ప్రపంచం అభివృద్ధి-పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛ-కుటుంబ వ్యవస్థ, మత విశ్వాసం-సంఘర్షణ వంటి అనేక వైరుధ్యాలతో సతమతమవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ప్రపంచం ప్రస్తుతం అస్తవ్యస్తంగా ఉంది. ఏ ఆనందమూ పరిపూర్ణంగా లభించడం లేదు. ఎక్కడా సమతుల్యత కనిపించడం లేదు, అతివాదం పెచ్చరిల్లుతోంది" అని ఆయన విశ్లేషించారు. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితులకు పరిష్కారం కోసం ప్రపంచం భారతదేశం వైపు ఆశగా చూస్తోందని భగవత్ అన్నారు. "ఈ సమస్యల నుంచి గట్టెక్కించే మార్గం భారత్ నుంచే వస్తుందని ప్రపంచ దేశాలకు తెలుసు" అని ఆయన వ్యాఖ్యానించారు.

## ఇద్దరు పాక్ చొరబాటుదారుల కాల్చివేత

- కాల్చి చంపిన బీఎస్ఎఫ్ బలగాలు
- చొరబాటు యత్నాన్ని భగ్నం చేసిన బీఎస్ఎఫ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 02 : పంజాబ్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఇద్దరు పాకిస్థానీ చొరబాటుదారులను సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఈరోజు కాల్చి చంపింది. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు వారు చేసిన ప్రయత్నాన్ని బీఎస్ఎఫ్ దళాలు సమర్థవంతంగా భగ్నం చేశాయి. ఈ ఘటనలో మరో చొరబాటుదారుడు పాకిస్థాన్ వైపు తిరిగి పారిపోయినట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే, టార్న్ టారన్ జిల్లాలోని ఖల్రా సెక్టార్ పరిధిలో ఉన్న రాజోకే బోర్డర్ అవుట్‌పోస్ట్ (బీఓపీ) సమీపంలో ఈ ఘటన జరిగింది. పాకిస్థాన్ వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా భారత భూభాగం వైపు వస్తుండటాన్ని బీఎస్ఎఫ్ సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన దళాలు, ముందుకు రావొద్దని వారిని హెచ్చరించాయి. అయితే, పలుమార్లు హెచ్చరించినా వారు పట్టించుకోకుండా ముందుకు సాగడంతో బీఎస్ఎఫ్ కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. మరణించిన వారిని ఇంకా అధికారికంగా గుర్తించలేదు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పంజాబ్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులతో కలిసి బీఎస్ఎఫ్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలంలో సోదాలు కొనసాగుతున్నాయి.

## జంతర్ మంతర్ వద్ద పోలీస్ బస్సును అడ్డుకున్న మహిళ

- నిరసనకారులను తీసుకెళుతుండగా చోటుచేసుకున్న ఘటన



న్యూఢిల్లీ, అక్టోబర్ 02 : న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఒక మహిళ పోలీస్ బస్సును అడ్డుకునేందుకు ప్రయత్నించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ దృశ్యాలను చూసిన నెటిజన్లు, కొన్ని నెలల క్రితం ముంబైలో మోడల్ రియా అహిర్ చేసిన చర్యతో దీనిని పోలుస్తూ రకరకాలుగా స్పందిస్తున్నారు. నిరసనకారులను అదుపులోకి తీసుకుని బస్సులో తరలిస్తున్న క్రమంలో, సదరు మహిళ ఆ వాహనానికి అడ్డుగా నిలబడింది. ఈ ఘటన జరిగిన సమయంలో అక్కడ మహిళా పోలీసులు ఎవరూ లేరని 'ఎక్స్' వేదికగా వెలువడిన ఒక పోస్ట్ ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా చక్కర్లు కొడుతోంది. గత జులై 2026లో ముంబైలో జరిగిన నిరసనల సందర్భంగా, విద్యార్థులను తరలిస్తున్న పోలీస్ వ్యాన్‌ను రియా అహిర్ (రియా ఇకొసియా) అడ్డుకున్నారు. వర్షంలో తడుస్తూనే సుమారు 40 నిమిషాల పాటు వాహనాన్ని ముందుకు కదలనివ్వకుండా ఆమె నిలువరించడం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనతో ఆమె సోషల్ మీడియాలో విశేష గుర్తింపు పొందారు. తాజాగా జంతర్ మంతర్ వద్ద చోటుచేసుకున్న ఘటన కూడా అదే తరహాలో ఉండటంతో, కేవలం ప్రచారం కోసమే ఈ మహిళ రియా అహిర్‌ను అనుకరించి ఉండవచ్చని కొందరు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. అయితే, ఈ మహిళ ఎవరు, ఆమె ఉద్దేశం ఏంటి అనే విషయాలపై ఇప్పటి వరకు స్పష్టత లేదు. ఈ ఘటనపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకున్నారనే వివరాలు కూడా ఇంకా తెలియరాలేదు.

## ట్రైన్‌లోకి పాములతో ఎంట్రీ..!?

బిహార్, అక్టోబర్ 02 : సాధారణంగా వికలాంగులూ, లేదా యాచకులు ట్రైన్‌లో ప్యాసింజర్స్ నుంచి డబ్బులు అడగడం మనం చూసి ఉంటాం. కానీ ఇక్కడ కొందరు వ్యక్తులు మాత్రం.. పాములతో ప్రయాణికులను బెదిరించి మరీ డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ షాకింగ్ ఘటన బిహార్‌లో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. సోన్‌పూర్ డివిజన్ పరిధిలో నడిచే జనసేవా ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లోకి ఎక్కిన ఆరుగురు వ్యక్తులు.. చేతులో పాములను పట్టుకొని.. ప్రయాణికులను బెదిరించి డబ్బులు వసూలు చేయడం స్టార్ట్ చేశారు. దీంతో తీవ్ర భయాందోళనకు గురైన ప్రయాణికులు వెంటనే రైల్వే అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే అప్రమత్తమైన సోన్‌పూర్ ఆవుట్‌పోస్ట్ ఖాకీ సిబ్బంది నెక్స్ట్ స్టేషన్‌లో రంగంలోకి దిగి.. పాములతో ప్రయాణికులను భయపెడుతున్న మొత్తం ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని స్టేషన్‌కు తరలించి విచారించగా.. వారంతా పొంతనలేని సమాధానాలు చెప్పినట్టు పోలీసలు తెలిపారు.. వారి ఆచూకీ గురించి ప్రశ్నించగా కొందరు లక్నో అని, మరికొందరు హిమాచల్ ప్రదేశ్ అంటూ పొంతన లేని సమాధానాలు ఇస్తున్నారని ఈసీఆర్ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సరస్వతి చంద్ర తెలిపారు. ప్రస్తుతం వారి గురించి పూర్తి వివరాలు రాబట్టే పనిలో ఉన్నామని.. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్టు పోలీసులు తెలిపారు. అలాగే ట్రైన్లలో పాములను తీసుకురావడం చట్టరీత్యా నేరమని.. ఇలాంటి ఘటనలకు ఎవరైనా పాల్పడితే.. చట్టప్రకారంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# ఫ్లైదుబాయ్ విమానంపై దాడి ఉగ్రవాద చర్యే..

- వెనకుండి నడిపించిన వారికి భారీ మూల్యం తప్పదు
- ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తీవ్ర హెచ్చరిక
- విమానంపై దాడి ఉగ్రవాద చర్యే: యూఏఈ

న్యూఢిల్లీ, అక్టోబర్ 02 : ఫ్లైదుబాయ్ విమానం ఘటన వెనుక ఉగ్రవాద చర్యలు ఉన్నాయని, కో-పైలట్‌ను పంపినవారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజిమిన్ నెతన్యాహు వార్నింగ్ ఇచ్చారు. కో-పైలట్ ఇస్లామిక్ తీవ్రవాద భావజాలానికి ప్రేరేపితమయ్యాడని, ప్రయాణికులు సహా విమానాన్ని కూల్చివేయాలనే ఉద్దేశంతో ఉన్నాడని అన్నారు. "అతడ్ని పంపిన వారు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది" అని ఆయన హెచ్చరించారు. భారత కెప్టెన్ స్మిత్ మచ్చార్‌పై దాడికి బయటి వ్యక్తులు ఆదేశించారా? అనేది దర్యాప్తు అధికారులు పరిశీలిస్తున్న తరుణంలో నెతన్యాహు హెచ్చరికలు వెలువడ్డాయి. "సమయం గడిచేకొద్దీ విషయం మరింత స్పష్టమవుతోంది.. నిందితుడు ఇస్లామిక్ తీవ్రవాద భావజాలాన్ని స్వీకరించాడు.. ప్రయాణికులతో సహా విమానాన్ని కూల్చివేయడానికే అతను వచ్చాడు.. అతడ్ని ఎవరైనా పంపారా? అనేది మేము దర్యాప్తు చేస్తున్నాం.. ఒకవేళ పంపినట్టు తేలితే.. వారు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది" అని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. బుధవారం దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానం ఫ్లై1073లో కో-పైలట్.. కాక్‌పిట్‌లో భారత్‌కు చెందిన కెప్టెన్ స్మిత్ మచ్చార్‌పై ఆయుధం దాడి చేశాడన్న ఆరోపణల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. 174 మందితో ప్రయాణిస్తున్న ఆ విమానం.. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ముందే 30 సెకన్ల కన్నా తక్కువ వ్యవధిలోనే 34 వేల ఎత్తు నుంచి నుంచి దాదాపు 14,000 అడుగుల మేర కిందకు పడిపోయింది. ఇదిలా ఉండగా, ఒమాన్ జాతీయుడైన కో-పైలట్ వెనుక ఇరాన్ ఉన్నట్టు అమెరికా, ఇజ్రాయెల్ అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. పరోక్షంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ హస్తం ఉండొచ్చు అంటూ వ్యాఖ్యలు చేశారు. అయితే, దీనిపై అధికారికంగా ఎటువంటి సమాచారం ఇప్పటి వరకు రాలేదు. దర్యాప్తు జరుగుతోందని, అదే నిజమైతే ఇరాన్‌పై భారీ దాడులు తప్పవని ఆయన హెచ్చరించారు. యూఏఈ అధ్యక్ష సలహాదారు అన్వర్ గర్గాష్ సైతం ఈ దాడిని తీవ్రమైన "ఉగ్రవాద చర్య"గా అభివర్ణించారు. ఆ క్లిష్ట సమయంలో భారత పైలట్ స్మిత్ మచ్చార్ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, బాధ్యతాయుత ప్రవర్తన వెలకట్టలేనిదని



కొనియాడినట్లు న్యూస్18 ఇంగ్లీష్ కథనం పేర్కొంది. తీవ్ర గాయాల పాలైనప్పటికీ పెను ఉగ్ర విలయాన్ని అడ్డుకుని వందలాది ప్రాణాలను కాపాడిన స్మిత్ నిజమైన హీరో అని ఎక్స్ వేదికగా ప్రశంసించారు. ఈ ప్రమాదకర ఘటనపై యూఏఈ న్యాయ విభాగం అధికారికంగా విచారణ ప్రారంభించింది. ముందస్తు ప్రణాళికతోనే దాడి చేశారా, ఏదైనా ఉగ్రవాద ముఠాతో సంబంధాలు ఉన్నాయా అనే అంశాలను నిశితంగా పరిశీలిస్తోంది. దర్యాప్తు కొనసాగుతున్నందున నిరాధార పుకార్లు, కథనాలు ప్రచారం చేయవద్దని అధికారులు ప్రజలను కోరారు. పిట్‌లో జరిగిన పెనుగులాటలో తీవ్ర రక్తస్రావం జరుగుతున్నా స్మిత్ మచ్చార్ డోర్ లాక్ తెరిచి ప్రయాణికులను కాపాడటంతో విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్‌లో సురక్షితంగా దించగలిగారు. ప్రస్తుతం అబుదాబిలో చికిత్స పొందుతున్న స్మిత్ ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోంది.

## ఆసియా క్రీడల్లో భారత్‌కు మరో స్వర్ణం

### 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించిన మహిళల హాకీ జట్టు

### ఫైనల్లో చైనాపై 1-0 తేడాతో ఉత్కంఠభరిత విజయం

న్యూఢిల్లీ, అక్టోబర్ 02 : భారత మహిళల హాకీ జట్టు అద్భుతం చేసింది. ఏళ్ల తరబడి ఊరిస్తున్న ఆసియా గేమ్స్ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. ఏకంగా 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ శుక్రవారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ చైనాను ఓడించి పసిడి పతకాన్ని ముద్దాడింది. ఈ చారిత్రాత్మక విజయంతో భారత క్రీడా ప్రపంచంలో సంబరాలు అంబరాన్నంటాయి. అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు 1-0 తేడాతో చైనాపై గెలుపొందింది. ఆట తొలి క్వార్టర్‌లోనే లాల్‌రెమ్‌సియామి హ్మార్జోతే అద్భుతమైన ఫీల్డ్ గోల్ చేసి భారత్‌కు ఆధిక్యాన్ని అందించింది. ఆ తర్వాత చైనా గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, భారత రక్షణ శ్రేణి గోడలా నిలిచింది. ముఖ్యంగా, గోల్ కీపర్ సవితా పూనియా ఒక కీలకమైన పెనాల్టీ స్ట్రోక్‌ను అడ్డుకుని జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. చివరి నిమిషం వరకు ఆధిక్యాన్ని కాపాడుకున్న భారత అమ్మాయిలు చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేశారు. భారత మహిళల హాకీ జట్టుకు ఆసియా క్రీడల్లో ఇది రెండో స్వర్ణం మాత్రమే. చివరిసారిగా 1982లో న్యూఢిల్లీలో జరిగిన ఆసియా గేమ్స్‌లో భారత్ స్వర్ణం సాధించింది. మళ్లీ ఇన్నేళ్లకు ఆ ఘనతను పునరావృతం చేసింది. ఈ విజయంతో భారత జట్టు 2028లో జరగనున్న లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించడం మరో విశేషం. ఈ టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబరిచిన భారత జట్టు, ఫైనల్‌కు ముందు సెమీఫైనల్లో దక్షిణ కొరియాపై 2-0 తేడాతో గెలిచిన విషయం తెలిసిందే. ఈ చారిత్రాత్మక విజయంపై క్రీడా లోకం హర్షం వ్యక్తం చేస్తోంది.

# ఉక్కు మహిళ నిర్మలా సీతారామన్

- ఇంటిని చక్కదిద్దుతున్నట్లు దేశాన్ని నిర్మల తీర్చిదిద్దుతున్నారు
- ఆమె నాయకత్వ పటిమను గుర్తించే ఆర్థిక శాఖ అప్పగింత
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంశలు
- ఈ పరిశ్రమతో కరవుసీమ ఇకపై కనకసీమగా మారుతుంది
- సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారు
- మూడేళ్లలో 36 ప్రాజెక్టులు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం
- మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ శంకుస్థాపనలో చంద్రబాబు
- గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన

మదనపల్లె, అక్టోబర్ 02 : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఒక 'ఉక్కు మహిళ' అని, దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేయడంలో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసలతో ముంచెత్తారు. ఓ మహిళ ఇంటిని ఎంత చక్కగా తీర్చిదిద్దగలదో, అదే విధంగా దేశ ఆర్థిక వ్యవస్థను నిర్మలా సీతారామన్ తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. ఆమె నాయకత్వ పటిమను గుర్తించే ప్రధాని నరేంద్ర మోదీ ఆర్థిక శాఖ వంటి కీలక బాధ్యతలు అప్పగించారని చంద్రబాబు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో శుక్రవారం జరిగిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐసా) శంకుస్థాపన కార్యక్రమంలో చంద్రబాబు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఎస్టీ వంటి నెక్స్‌జెన్ సంస్కరణలు, డీబీటీ ద్వారా సంక్షేమ పథకాల్లో పారదర్శకత తీసుకురావడం ద్వారా దేశాన్ని బలోపేతం చేస్తున్న ఘనత నిర్మలా సీతారామన్‌కు దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయగలుగుతోందంటే దానికి కేంద్ర ప్రభుత్వ సహకారమే కారణమని స్పష్టం చేశారు. అమరావతి, విశాఖ ఉక్కు, పోలవరం వంటి కీలక ప్రాజెక్టులకు కేంద్రం అండగా నిలుస్తోందని గుర్తుచేశారు. ముఖ్యంగా,



మదనపల్లెలో ఏర్పాటు కానున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కోసం నిధుల కేటాయింపులో నిర్మలా సీతారామన్ చూపిన చొరవ, అందించిన సహకారాన్ని ఎప్పటికీ మరువలేమని చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ, మంత్రి నారా లోకేశ్ కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. రూ.లక్ష కోట్ల అంచనా వ్యయంతో ఈ హబ్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో కేంద్ర సహకారంతో రూ.40 వేల కోట్లు, ప్రైవేటు పెట్టుబడుల ద్వారా మరో రూ.60 వేల కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ భారీ ప్రాజెక్టు రాయలసీమ ప్రాంత అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. కాగా "అనంత్ అంబానీ... మీరు ఆంధ్రప్రదేశ్ ముద్దుబిడ్డ" అంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీని ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. అంతకుముందు, సభలో ప్రసంగించిన అనంత్ అంబానీ ఆంధ్రప్రదేశ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. తనను ఆంధ్రప్రదేశ్ బిడ్డగా భావించాలని, రాష్ట్ర అభివృద్ధికి తాను ఏం చేయాలో మార్గనిర్దేశం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. ఆయన ప్రసంగానికి సభికుల నుంచి విశేష స్పందన లభించింది. అనంత్ ప్రసంగం ముగియగానే కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఆయనను అభినందించారు. అనంతరం ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, అనంత్ అంబానీ మాటలపై స్పందించారు. "అనంత్ అంబానీని మన రాష్ట్ర ముద్దుబిడ్డగా భావిస్తున్నాం. రాష్ట్ర అభివృద్ధిలో రిలయన్స్ సంస్థ మరింతగా భాగస్వామి కావాలి" అని వేదికపై నుంచి ప్రకటించారు. కరవుపీడిత రాయలసీమ తలరాతను, రూపురేఖలను మార్చేందుకు గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను తీసుకొచ్చామని, ఈ ప్రాంతాన్ని ఫ్రూట్ బౌల్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారని అన్నారు. రూ. లక్ష కోట్ల పెట్టుబడితో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, కరవు సీమ ఇకపై కనకసీమగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. 2026 అక్టోబర్ 2వ తేదీ ఈ ప్రాంత చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అదనంగా ఆరు లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలను విస్తరిస్తామని, ఈ హబ్ ద్వారా పంటల ఉత్పత్తి, ధరల స్థిరీకరణ సాధ్యమవుతుందని వివరించారు. ఎన్టీ రామారావు ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళుతున్నామని, హంద్రీనీవా లేకపోతే మదనపల్లె ప్రాంతం వలసలతో ఖాళీ అయ్యేదని గుర్తుచేశారు. మూడేళ్లలో రూ.35,000 కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. హంద్రీనీవా ఫేజ్-2, వెలిగొండ ఫేజ్-2, మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణ పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీని 'ఆంధ్రా బిడ్డ' అని అభివర్ణించిన చంద్రబాబు, తిరుమలకు ఉచితంగా ఎలక్ట్రిక్ బస్సులు అందించడంపై ప్రశంసించారు. పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా సాగుతున్నాయని, దాన్ని కూడా పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. కాగా ప్రభుత్వ కార్యక్రమాల్లో క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని, సభా మర్యాదను ప్రతి ఒక్కరూ పాటించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మదనపల్లెలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగానికి కొందరు యువకులు అంతరాయం కలిగించడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి తీరుపై వేదిక నుంచే మండిపడ్డారు. నిర్మలా సీతారామన్ తెలుగులో ప్రసంగిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. సభకు హాజరైన వారిలో కొందరు యువకులు ఈలలు వేస్తూ, కేకలు పెడుతూ నినాదాలతో గందరగోళం సృష్టించారు. ఆమె ప్రసంగానికి పదేపదే అడ్డుతగలడంతో వేదికపై ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు కలుగజేసుకున్నారు. వెంటనే తన చైర్ నుంచి లేచి వెళ్లి మైక్ అందుకున్న చంద్రబాబు, యువకుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "కేంద్ర మంత్రి ప్రసంగిస్తున్నప్పుడు ఇలా క్రమశిక్షణ లేకుండా ప్రవర్తించడం సరికాదు. ఇది మంచి పద్ధతి కాదు. సభకు ఒక గౌరవం ఉంటుంది, దానిని కాపాడాలి" అంటూ గట్టిగా హెచ్చరించారు. ముఖ్యమంత్రి ఆగ్రహంతో ఒక్కసారిగా సభలో నిశ్శబ్దం అలుముకుంది. అయితే, ఈ గందరగోళం మధ్య కూడా కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ సంయమనం కోల్పోలేదు. ఆమె తన ప్రసంగాన్ని తెలుగులోనే కొనసాగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను, రాష్ట్ర అభివృద్ధి పట్ల ఆయనకున్న నిబద్ధతను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమం అనంతరం ముఖ్య నేతలు మొక్కలు నాటారు. ఉద్యాన రంగానికి సంబంధించి ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, బీసీ జనార్ధన్ రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

### అక్టోబర్ 15 నాటికి వాయుగుండంగా మారే చాన్స్



అమరావతి, అక్టోబర్ 02 : నైరుతి రుతుపవనాల సీజన్‌లో తీవ్ర వర్షపాత లోటుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్‌కు వాతావరణానికి సంబంధించిన మరో కీలక అప్‌డేట్ వచ్చింది. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని, ఇది వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ శుక్రవారం వెల్లడించింది. దీని కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది. సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, అక్టోబర్ 12వ తేదీన ఉత్తర అండమాన్ సముద్రంపై ఉపరితల ఆవర్తనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో అక్టోబర్ 13 నాటికి అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయి. ఈ అల్పపీడనం పశ్చిమ, వాయవ్య దిశగా ప్రయాణిస్తూ మరింత బలపడనుంది. అక్టోబర్ 15 నాటికి ఇది దక్షిణ, మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో వాయుగుండంగా మారవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో దీని గమనం, తీవ్రతపై మరింత స్పష్టత వస్తుందని, వాతావరణ పరిస్థితులను బట్టి మార్పులు ఉండవచ్చని పేర్కొన్నారు. కాగా, ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో (జూన్ 1 – సెప్టెంబర్ 30) రాష్ట్రంలో సాధారణం కంటే చాలా తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో సగటున 589.7 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా, కేవలం 383.6 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 34.9 శాతం వర్షపాత లోటు ఏర్పడింది. ఈ నేపథ్యంలో బంగాళాఖాతంలో ఏర్పడనున్న ఈ వాతావరణ వ్యవస్థ ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయా లేదా అనే అంశంపై ఆసక్తి నెలకొంది.

## యువ వైద్యురాలు అనుమానాస్పద మృతి



హైదరాబాద్, అక్టోబర్ 02 : హైదరాబాద్‌లో ఓ యువ వైద్యురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం తీవ్ర కలకలం రేపింది. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హఫీజ్ పేట్ ఆదిత్య నగర్‌లోని ఓ ప్రైవేట్ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం ఈ ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మృతురాలు (27) సంగారెడ్డి జిల్లాకు చెందిన యువతి. మహబూబ్‌నగర్‌లో వైద్య విద్యను అభ్యసించిన ఆమె, ఇటీవల వరంగల్‌లో పీడియాట్రిక్స్‌లో పీజీ పూర్తి చేశారు. మూడు రోజుల క్రితం తన స్నేహితుడైన ఓ యువకుడితో కలిసి వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఆమె, ఇక్కడ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో బస చేశారు. కుమార్తె ఫోన్ అందుబాటులోకి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు, ఆమె మొబైల్ లొకేషన్‌ను ట్రేస్ చేశారు. అనంతరం శుక్రవారం మియాపూర్ పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు సదరు సర్వీస్ అపార్ట్‌మెంట్‌కు చేరుకుని పరిశీలించగా, అప్పటికే ఆమె అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉంది. ఈ ఘటనపై మియాపూర్ సీఐ జయరాం మాట్లాడుతూ, మృతురాలితో పాటు ఉన్న యువకుడు ప్రస్తుతం పరారీలో ఉన్నాట్లు వెల్లడించారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించామని, పోస్టుమార్టం నివేదిక అందిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయని వివరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు, పరారీలో ఉన్న యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## పరిశుభ్రత కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు

- పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత
- నెలకు ఒక రోజైనా పరిశుభ్రతపై ప్రజలు దృష్టి పెట్టాలి
- చెత్తను సంపదగా మార్చే కార్యక్రమాలు అమలు చేస్తున్నాం
- స్వచ్ఛాంధ్ర -- స్వర్ణాంధ్ర" కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

విజయవాడ, అక్టోబర్ 02 : పరిశుభ్రత కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, అది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. స్వచ్ఛాంధ్ర సాధనలో ఐదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలు భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్కరూ నెలకు ఒక్క రోజైనా తమ పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం విజయవాడలో జరిగిన



"స్వచ్ఛాంధ్ర -- స్వర్ణాంధ్ర" అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు మనం అందించే నిజమైన ఆస్తి స్వచ్ఛాంధ్ర కార్యక్రమమేనని అన్నారు. కేవలం రోడ్లు శుభ్రంగా ఉంటే సరిపోదని, ప్రజల ఆలోచనా విధానంలో మార్పు రావాలని అభిప్రాయపడ్డారు. తమ ప్రభుత్వం చెత్తను ఒక సమస్యగా కాకుండా, సంపదగా చూస్తోందని, చెత్త నుంచి సంపద సృష్టించే కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో పరిశుభ్రతను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని చంద్రబాబు విమర్శించారు. వారి వైఖరి కారణంగానే కృష్ణా, గోదావరి నదులతో పాటు కాలువల్లోకి మురుగునీరు చేరి తీవ్రంగా కలుషితమయ్యాయని ఆరోపించారు. పర్యావరణంపై పడిన ఈ ప్రభావం వాతావరణ మార్పులకు కూడా దోహదపడిందని, ప్రస్తుతం రాష్ట్రం 53 శాతం వర్షపాత లోటును ఎదుర్కోవడానికి పారిశుద్ధ్య లోపాలు కూడా ఒక కారణమని ఆయన పేర్కొన్నారు. ప్రతి పౌరుడు స్వచ్ఛాంధ్రలో భాగస్వామి అయినప్పుడే స్వర్ణాంధ్ర లక్ష్యాలు నెరవేరతాయని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత పాటించిన గ్రామాలు, పట్టణాలు, వివిధ సంస్థలకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మంత్రులు నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరాం తదితరులు పాల్గొన్నారు.

## 'యువగళం' పాదయాత్ర హామీని నెరవేర్చిన కూటమి ప్రభుత్వం

మదనపల్లె, అక్టోబర్ 02 : 'యువగళం' పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్ రాయలసీమ రైతాంగానికి ఇచ్చిన కీలక హామీ కార్యరూపం దాల్చింది. రూ.1 లక్ష కోట్ల భారీ ప్రణాళికతో రాయలసీమతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా మార్చే 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' (జీహెచ్‌హెచ్)కు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మదనపల్లె వేదికగా ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ప్రారంభించింది. ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే కాక, ప్రపంచానికే 'ఫ్రూట్ బౌల్'గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ అభివృద్ధి కోసం రాబోయే మూడేళ్లలో ప్రభుత్వం రూ.40,352 కోట్లు ఖర్చు చేయనుంది. దీనికి అదనంగా, ప్రైవేట్ రంగం నుంచి మరో రూ.60,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించారు. 'సీడ్ టు షిప్‌మెంట్' విధానంలో విత్తనం వేసిన దగ్గర నుంచి పంటను ఎగుమతి చేసే వరకు ప్రతి దశలోనూ ఉద్యాన రైతులకు అండగా నిలవడమే ఈ హబ్ ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగా సాగునీటి ప్రాజెక్టులు, డ్రిప్ ఇరిగేషన్, రహదారుల నిర్మాణం, కోల్డ్ స్టోరేజీలు, లాజిస్టిక్స్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివిధ శాఖలతో సమీక్షలు జరపడంతో పాటు, కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరిపి ఈ ప్రాజెక్టుకు నిధులు సమకూర్చేలా ఒప్పించారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు



నారా లోకేశ్ 'యువగళం' పేరుతో చరిత్రాత్మక పాదయాత్ర చేపట్టారు. రాయలసీమలో 124 రోజుల పాటు 1,587 కిలోమీటర్లు నడిచి, 44 నియోజకవర్గాల్లో పర్యటించారు. ఆ సమయంలో లక్షలాది మంది రైతులను నేరుగా కలిసి వారి కష్టాలను ప్రత్యక్షంగా చూశారు. వారి ఇబ్బందులు చూసి చలించిపోయిన లోకేశ్.. 2023 జూన్ 7న కడపలో 'మిషన్ రాయలసీమ'ను ప్రకటించారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందిస్తామని భరోసా ఇచ్చారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ, ఫుడ్ ప్రాసెసింగ్, పల్పింగ్ యూనిట్ల ఏర్పాటు వంటి హామీలను ఆనాడు ఇచ్చారు. ఒకప్పుడు కరవుకు చిరునామాగా ఉన్న రాయలసీమ, ఈ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా దేశంలోనే అగ్రగామి ఉద్యాన ప్రాంతంగా మారనుంది. మామిడి, అరటి, టమాటా, దానిమ్మ, బొప్పాయి, స్వీట్ ఆరెంజ్ వంటి సంప్రదాయ పంటలతో పాటు ఖర్జూరం, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, ఆపిల్ బెర్రీస్ వంటి అధిక విలువ కలిగిన కొత్త రకం పంటల సాగుకు ప్రోత్సాహం లభించనుంది. ఈ బృహత్తర ప్రాజెక్టు రైతుల ఆదాయాన్ని పెంచడం, గ్రామీణ యువతకు ఉపాధి కల్పించడంతో పాటు 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించనుంది.

## జ్యోతి కాలేజీలో ఎం.ఏ. ఎడ్యుకేషన్, ఈసీసీఈ కోర్సులు

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా దూరవిద్యా విధానంలో సిరిసిల్లలోని జ్యోతి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో నూతనంగా ఎం.ఏ. ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) కోర్సులను మంజూరు చేసినట్లు విద్యార్థి సేవా విభాగం డైరెక్టర్ డా. వై. వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.2026–27 విద్యా సంవత్సరానికి ఓపెన్ యూనివర్సిటీ ప్రవేశాల గడువును అక్టోబర్ 13, 2026 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్‌లో ప్రవేశ నమోదు ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అనంతరం విద్యార్థులు తాము ఎంపిక చేసుకున్న స్టడీ సెంటర్‌ను సంప్రదించి తదుపరి ప్రవేశ ప్రక్రియకు సంబంధించిన వివరాలను తెలుసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని డా. వెంకటేశ్వర్లు సూచించారు.



## ఏడడుగుల బంధం.. విద్యుత్ షాక్‌తో విషాదాంతం..

**-పంటను కాపాడబోయి.. ప్రాణాలు కోల్పోయిన రైతు దంపతులు**

బలగం టీవీ,గంభీరావుపేట:

కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగానిలిచారు.. చేతిలో చేయి వేసుకుని జీవిత ప్రయాణం సాగించారు.ఆరుగాలం శ్రమిస్తూ పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. కుటుంబాన్ని పోషించేందుకు ప్రతిరోజూ పొలానికి వెళ్లే ఆ రైతు దంపతులకు అదే పొలం చివరకు మృత్యువుగా మారింది. పంటను అడవి జంతువుల నుంచి కాపాడుకునే ప్రయత్నంలో ఏర్పాటుచేసిన విద్యుత్ తీగకు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై భార్యాభర్తలు మృతి చెందిన విషాద ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో చోటుచేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంభీరావుపేటకు చెందిన గంట దేవయ్య (65), ఆయన భార్య గంట లక్ష్మి (58) కౌలుకు తీసుకున్న పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. పంటను అడవి జంతువుల నుంచి కాపాడుకునేందుకు ప్రతిరోజూ పొలం వద్దకు వెళ్లి పంటను పరిశీలించేవారు. ఈ క్రమంలో అడవి జంతువులు పొలంలోకి రాకుండా అడ్డుకునేందుకు పొలం వద్ద ఉన్న స్టార్టర్ డబ్బా నుంచి విద్యుత్ వైరు ను తీసి పొలం చుట్టూ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గురువారం సాయంత్రం దేవయ్య, లక్ష్మి దంపతులు పొలం వద్దకు వెళ్లారు. శుక్రవారం ఉదయం గొల్ల నిశాంత్ తన పొలం వైపు వెళ్లగా, దేవయ్య, లక్ష్మి ఇద్దరూ విద్యుత్ షాక్‌కు గురై విగతజీవులుగా పడి ఉండటాన్ని గమనించి,వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. మృతుల కుమార్తె గంధపు భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.జీవితాంతం ఒకరికొకరు తోడుగా నిలిచిన దంపతులుచివరి క్షణంలోనూ ఒకరిని విడిచి మరొకరు లేకుండా ఒకే చోట మృత్యువాత పడటం స్థానికులను కలచివేసింది. కుటుంబాన్ని నిలబెట్టేందుకు శ్రమించిన తల్లిదండ్రులను ఒకేసారి కోల్పోవడంతో వారి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. దంపతుల మృతితో గంభీరావుపేట మండల కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఉపసర్పంచ్‌ల చెక్ పవర్‌పై విధిస్తున్న ఆంక్షలను వెంటనే తొలగించాలి

**ఉపసర్పంచ్‌ల హక్కులను కాపాడాలి**

**చెక్ పవర్‌ను యథావిధిగా కొనసాగించాలి**

**ఉప సర్పంచ్ లకు గౌరవంతో పాటు గౌరవ వేతనం ఇవ్వాలి**

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట



ఉప సర్పంచుల హక్కులను కాపాడాలని చెక్ పవర్ యథావిధిగా కొనసాగించాలని ఎల్లారెడ్డిపేట మండలం ఉప సర్పంచుల పోరం అధ్యక్షులు మందాటి రాము యాదవ్ అన్నారు. ఉప సర్పంచ్ లు రాజ్యాంగ బద్ధంగా బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నుకోబడిన వారు కాబట్టి ఉప సర్పంచ్ లకు గౌరవం తో పాటు గౌరవ వేతనం ఇవ్వాలని, నిధులు దుర్వినియోగం కాకుండా ఉండాలంటే ఉప సర్పంచ్ లకు జాయింట్ చెక్ పవర్ తో పాటు మండల సర్వ సభ్య సమావేశానికి ఆహ్వానించాలని రాష్ట్ర ప్రభుత్వం ను ఆయన డిమాండ్ చేశారు. ఉపసర్పంచ్‌ల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమిస్తామని రాము యాదవ్ అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమను గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు,



## ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో గాంధీ జయంతి

**పాల్గొన్న సర్కిల్ ఇన్స్పెక్టర్ ఓ, వెంకటేష్, ఎస్సై రమేష్ గౌడ్**

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఓ. వెంకటేష్ , ఎస్సై ఎన్. రమేష్ మరియు పోలీస్ సిబ్బంది మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిఐ వెంకటేష్ మాట్లాడుతూ

మహాత్మా గాంధీ అహింస, సత్యం, శాంతి, సామరస్యాల మార్గంలో చూపిన ఆదర్శాలను ప్రతి ఒక్కరూ పాటించాలని, గాంధీజీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సమాజంలో శాంతి, సోదరభావం, స్వచ్ఛతను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల సంక్షేమ హామీల అమలుకు పోస్టుకార్డు ఉద్యమం

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపట్టారు. గాంధీ జయంతి సందర్భంగా గాంధీ చౌక్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ప్రధాన తపాలా కార్యాలయంలో పోస్టుకార్డులను పంపించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీల మేరకు జర్నలిస్టులకు ఆరోగ్య పథకం, ఇళ్ల స్థలాలు, ఉచిత విద్యతో పాటు ఇతర సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం మీడియా అకాడమీకి రూ.100 కోట్లు కేటాయిస్తామని ఇచ్చిన హామీని కూడా అమలు చేయాలని కోరారు.జర్నలిస్టుల సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## గాంధీజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**-రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**గాంధీజీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు**

బలగం టీవీ, వేములవాడ:

మహాత్మా గాంధీజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గాంధీజీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా శుక్రవారం వేములవాడ పట్టణంలోని వారి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్య్రం సాధించడంలో మహాత్మా గాంధీజీ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. బ్రిటిష్ పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా అహింస, శాంతియుత మార్గాలను అనుసరిస్తూ ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఉప్పు సత్యాగ్రహం, విదేశీ వస్త్రాల బహిష్కరణ, భారత్ విడిచి వెళ్లండి ఉద్యమం వంటి పోరాటాల ద్వారా స్వాతంత్య్ర ఉద్యమానికి నూతన ఉత్తేజాన్ని అందించారని అన్నారు .గాంధీజీ జీవితం, ఆయన అనుసరించిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. యువత మహాత్ముడి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజంలో శాంతి, ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్య్రం కోసం మహాత్మా గాంధీజీ చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సూచించారు.గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మహనీయులు చూపిన మార్గంలో పయనిస్తూ వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు.

## ఐడీఓసీలో గాంధీజీకి నివాళులర్పించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ఘనంగా గాంధీ జయంతి వేడుకలు**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ జ్యోతి ప్రజ్వలన చేసి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీజీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. సత్యం, అహింసా మార్గాల్లో గాంధీజీ సాగించిన పోరాటం దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గాంధీజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ఆయన చూపిన బాటలో ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, గనుల శాఖ సహాయ సంచాలకుడు క్రాంతి, ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకురాలు స్వప్న, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, బీసీ సంక్షేమ శాఖ అధికారి సౌజన్యతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గాంధీజీ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం



**-జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

జాతిపిత మహాత్మా గాంధీజీ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే అన్నారు. గాంధీజీ జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గీతే మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీజీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. సత్యం, అహింస మార్గాలను అనుసరించి దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు గాంధీజీ చేసిన కృషి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. నేటి యువత గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గాలను అనుసరిస్తూ ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని సూచించారు.గాంధీజీ నమ్మిన సిద్ధాంతాలు, విలువలను నిబద్ధతతో ఆచరించడం వల్లే ఆయన కీర్తి, ప్రతిష్ఠలు ప్రపంచవ్యాప్తంగా చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు పోలీసు అధికారులు వెంకటేశ్వర్లు, సురేష్, రమేష్, పోలీసు అధికారులు మోగిలి, మధుకర్, ఉప పరిశీలకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గాంధీజీ ఆశయాలు స్ఫూర్తిదాయకం..

**-మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

సిరిసిల్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి ముఖ్య అతిథిగా హాజరై గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కళ చక్రపాణి మాట్లాడుతూ.. మహాత్మా గాంధీజీ 157వ జయంతి సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సత్యం, అహింస, శాంతిని ఆయుధాలుగా చేసుకుని స్వాతంత్య్ర పోరాటంలో ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చిన గాంధీజీ పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు.గాంధీజీ సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని శాంతియుత మార్గంలో తెలంగాణ ఉద్యమాన్ని కొనసాగించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించామని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో సమసమాజ నిర్మాణంతో పాటు పరిశుభ్రమైన సమాజం కోసం పట్టణ ప్రగతి, పల్లె ప్రగతి కార్యక్రమాలను చేపట్టి పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.డి. ఖాదీర్ పాషా,మున్సిపల్ విప్ బుర్ర మల్లికార్జున్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పట్టణ ప్రముఖులు పాల్గొని గాంధీజీకి నివాళులర్పించారు.



## ఎల్లారెడ్డిపేట మండలంలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండల వ్యాప్తంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, ఇతర సంస్థల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.



ఈ సందర్భంగా గాంధీజీ దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటాన్ని, ఆయన అనుసరించిన అహింస, సత్యం, శాంతి, స్వచ్ఛత వంటి విలువలను పలువురు గుర్తు చేసుకున్నారు. ప్రజలందరూ గాంధీజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి తమ వంతు బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ.. గాంధీజీ చూపిన అహింసా మార్గం దేశ చరిత్రలో ప్రత్యేకమైనదని, సాధారణ ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. దేశం కోసం ఆయన చేసిన త్యాగాలు, సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.

అనంతరం కొన్ని గ్రామాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు. గాంధీజీ కలలు కన్న పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.

మండలంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, నాయకులు, యువత, గ్రామస్తులు తదితరులు పాల్గొని మహాత్మా గాంధీకి ఘన నివాళులు అర్పించారు. గాంధీ జయంతి వేడుకలలో ఎల్లారెడ్డిపేట సర్పంచ్ ఎలగందుల నరసింహులు, గొల్లపల్లి సర్పంచ్ కొండ రమేష్ గౌడ్, బొప్పాపూర్ సర్పంచ్ ఇల్లెందుల గీతాంజలి, దుమాల సర్పంచ్ సోమరపు శరవిందు, బండ లింగంపల్లి సర్పంచ్ నర్సాగౌడ్, తిమ్మాపూర్ సర్పంచ్ అందే సుభాష్, కాంగ్రెస్ నాయకులు బండారి బాల్ రెడ్డి, గుర్రాల రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు,





# గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం



**-యువత క్రీడల వైపు అడుగులు వేయాలి.**
**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ,వేములవాడ:**

గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించి, వారి ప్రతిభను రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 52వ రాష్ట్రస్థాయి బాలుర, 36వ రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ పోటీలను జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతేతో కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు.

విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఒలింపిక్ జెండాను ఆవిష్కరించి టార్చ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ

రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 68 జట్లకు చెందిన 1,300 మందికి పైగా క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు, పీఈటీలు, పీడీలు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని అన్నారు . నాలుగు రోజుల పాటు జరిగే పోటీలకు హాజరైన వారికి వసతి, భోజన సదుపాయాలు కల్పించామని, ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు .యువత విద్యతో పాటు క్రీడలపై దృష్టి సారించి శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రతిభను వెలికితీసేందుకు సీఎం కప్ ద్వారా 42 రకాల క్రీడలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ నుంచి ఒలింపిక్స్‌లో పతకాలు సాధించే క్రీడాకారులను తయారు చేయాలనే లక్ష్యంతో రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

వేములవాడ ప్రాంతానికి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో వంటి గ్రామీణ క్రీడలతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. స్థానిక క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గత ఏడాది వేములవాడలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించామని, అదే స్ఫూర్తితో ఈ ఏడాది కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే వారికి ఉన్నత విద్య, ఉద్యోగాల్లో లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. పోటీల నిర్వహణకు సహకరిస్తున్న జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు, పట్టణ, పరిసర గ్రామాల ప్రజలకు అభినందనలు తెలిపారు.



# మానాల గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా జక్కుల శ్రీనివాస్ ఏకగ్రీవం..!

**బలగం టీవీ, రుద్రంగి :**

రుద్రంగి మండలం మానాల గ్రామంలో శుక్రవారం గ్రామ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా జక్కుల శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా చెదలు నవీన్, రెండో వైస్ చైర్మన్‌గా బాధవత్ రవి, కార్యదర్శిగా నాంచారి రాకేష్ ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా నూతన చైర్మెన్ జక్కుల శ్రీనివాస్ మాట్లాడుతూ... గ్రామ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల అమలుకు సమష్టిగా కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను గ్రామస్తులు, పలువురు ప్రజాప్రతినిధులు, శాలువాతో సన్మానించి, నాయకులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా గాంధీ, శాస్త్రి జయంతి వేడుకలు..

**మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకం: మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**

**బలగం టీవీ, వేములవాడ:**

మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కమిషనర్ లోకేష్, వైస్ చైర్మన్ నరాల శేఖర్, గౌరవ కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ దేశానికి అందించిన సత్యం, అహింసా సిద్ధాంతాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. స్వాతంత్ర్య సమరంలో గాంధీజీ చేసిన త్యాగాలు, దేశ సేవ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా గాంధీజీ సాగించిన పోరాటం భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచిందన్నారు. సత్యం, అహింస, సత్యాగ్రహాన్ని ఆయుధాలుగా చేసుకొని స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా గాంధీజీ మలిచారని తెలిపారు. ప్రజలు, ముఖ్యంగా యువత గాంధీజీ చూపిన సత్యం, అహింసా మార్గంలో నడుస్తూ జాతి సమగ్రతను కాపాడుకోవాలని సూచించారు. అదే మహాత్మా గాంధీకి మనం అందించే ఘనమైన నివాళి అని అన్నారు.



అనంతరం భారత మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి కూడా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. దేశ సమగ్ర అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం లాల్ బహదూర్ శాస్త్రి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. “జై జవాన్.. జై కిసాన్” నినాదంతో దేశ ప్రజల్లో స్ఫూర్తిని నింపిన మహనీయుడు శాస్త్రి అని కొనియాడారు.

భారత్–పాకిస్తాన్ యుద్ధ సమయంలో దేశానికి ధైర్యంగా నాయకత్వం వహించిన శాస్త్రి, దేశ రక్షణను పటిష్టం చేయడంతో పాటు అనేక కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు, పోరాట యోధులు దేశానికి చేసిన సేవలను, వారి త్యాగాలను గుర్తించి గౌరవించడం ప్రజలు, యువతతో పాటు ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లోకేష్, వైస్ చైర్మన్ నరాల శేఖర్, గౌరవ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# గాంధీకి తంగళ్లపల్లి కాంగ్రెస్ ఆధ్వర్యంలో నివాళులు..

**బలగం టీవీ, తంగళ్లపల్లి:**

మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మునిగేల రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా మహాత్మా గాంధీజీ దేశానికి అందించిన సేవలను, ఆయన పాటించిన సత్యం, అహింస సిద్ధాంతాలను నాయకులు స్మరించుకున్నారు. గాంధీజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని మహాత్మా గాంధీజీకి నివాళులు అర్పించారు.

# విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

**బలగం టీవీ, కొడిమ్యాల**

కొత్త ఇంట్లో గృహప్రవేశం చేసి నెల రోజులు కూడా గడవకముందే ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. శుక్రవారం ఉదయం విద్యుత్ షాక్‌కు గురై కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన జనగం రూప (30) మృతి చెందారు.

స్థానికుల కథనం మేరకు.. రూప భర్త నరేష్ గల్ఫ్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నారు. నెల రోజుల క్రితం గల్ఫ్ నుంచి స్వగ్రామానికి వచ్చిన నరేష్ నూతనంగా నిర్మించిన ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి గృహప్రవేశం నిర్వహించారు. అనంతరం ఉపాధి కోసం తిరిగి గల్ఫ్‌కు వెళ్లారు. ఇంతలోనే రూప విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.భార్యను కోల్పోయిన నరేష్‌కు, తల్లిని కోల్పోయిన ఇద్దరు కుమారులకు ఈ ఘటన తీరని లోటుగా మిగిలింది. ఘటన స్థలాన్ని స్థానిక పోలీసులు పరిశీలించారు.

# అహింసా మార్గంలో గాంధీజీ చూపిన బాటలో నడవాలి



**బీఆర్ఎస్ నాయకులు**
**ఎల్లారెడ్డిపేటలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పార్టీ మరియు జెడ్పీటీసీ కార్యాలయంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు వరసు కృష్ణహరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీ పోషించిన పాత్ర చారిత్రాత్మకమని పేర్కొన్నారు. సత్యం, అహింస, శాంతి మార్గాలను ఆయుధాలుగా చేసుకుని బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గాంధీజీ సాగించిన పోరాటం దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకమని అన్నారు.

గాంధీజీ చూపిన అహింసా మార్గం, సత్యనిష్ఠ, త్యాగం, దేశభక్తి విలువలను నేటి తరం కూడా ఆచరించాలని నాయకులు పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యతను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

మహాత్మా గాంధీ దేశం కోసం చేసిన త్యాగాలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మీసం రాజన్న, ఆకుల మురళీమోహన్ గౌడ్, ఎడ్ల సందీప్, పరుశురాం గౌడ్, నేవూరి వెంకట నరసింహారెడ్డి, గుండాడి వెంకటరెడ్డి, లింగాల సందీప్, హసన్ బాయ్, తోట రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నా నిరంతర కృషికి ఫలితం.. ప్రత్యేక పోలీస్ స్టేషన్లు..

**- జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు మ్యాకల పర్శరాములు.**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

జిల్లాలో ప్రత్యేక మహిళా పోలీస్ స్టేషన్‌తో పాటు సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలనే అంశాన్ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు మ్యాకల పర్శరాములు గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పలుమార్లు వినతిపత్రాలు సమర్పించారు.

ప్రజల భద్రత, మహిళల రక్షణను దృష్టిలో ఉంచుకుని తాను నిరంతరం ఈ అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో ప్రత్యేక మహిళా పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టడం పట్ల మ్యాకల పర్శరాములు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో తాను ఎల్లప్పుడూ ముందుంటానని పర్శరాములు పేర్కొన్నారు.

# ‘అంగన్ మిలన్ సేవ’లో అంగన్ వాడీలకు ఆయాలకు ఘనంగా సత్కారం..

**- జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి దుంపేనా స్రవంతి ఆధ్వర్యంలో నిర్వహణ**

**- గర్భిణీలకు శ్రీమంతం, పిల్లలకు అక్షరాభ్యాసం**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి పిలుపు మేరకు అంగన్ మిలన్ సేవ కార్యక్రమాన్ని బిజెపి జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి దుంపెన స్రవంతి ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడి కార్యకర్తలను ఆయాలను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.

ఎల్లారెడ్డిపేట.. సెంటర్ టీచర్ కొర్రి సునీత ఆయా పెంటం భారతమ్మ, సెంటర్ టీచర్ నేవూరి నర్మద, సెంటర్ టీచర్ మల్లారం అరుణ ఆయా శిరీష, సెంటర్ ఎం. కవిత ఆయా యాదమ్మ, సెంటర్ టీచర్ కృష్ణవేణి ఆయా సత్తెమ్మ, సెంటర్ టీచర్ బాల్ నర్సమ్మ ఆయా రేణుక, సెంటర్ టీచర్ రేణుక ఆయా రవళిక లను బిజెపి మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి స్రవంతి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు శ్రీమంతం, పిల్లలకు అక్షరాభ్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మహిళా మోర్చా నాయకురాలు దాసరి పూర్ణిమ, నాయకులు గంట బాలకిషన్ గౌడ్, నేవూరి శ్రీనివాస్ రెడ్డి, అంతేరుపుల తిరుపతి, కిరణ్ నాయక్, చందుపట్ల లక్ష్మారెడ్డి దాసరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.






# స్వేరోస్ నెట్‌వర్క్ రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన కమిటీ ఏర్పాటు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాజన్న సిరిసిల్ల మరియు కామారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి బొర్ర సురేష్ కుమార్ ఆధ్వర్యంలో స్వేరోస్ నెట్‌వర్క్ రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించారు. జిల్లా అధ్యక్షుడిగా బట్టు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా ఆకుల మహేష్ గౌడ్, ఉపాధ్యక్షులుగా జింక శ్రీధర్, దోమకొండ సురేందర్, పల్లె నర్సింలు, కొత్తపల్లి ప్రభాకర్. కోశాధికారిగా బి. ప్రశాంత్, అధికార ప్రతినిధిగా మారుపాక హరీష్‌ను నియమించారు. సహాయ కార్యదర్శులుగా జె. నాగరాజు, ప్యాట రాజేష్, గుర్రాల రాజశేఖర్ రెడ్డి, కుమ్మరి వేణుఆర్గనైజింగ్ కార్యదర్శులుగా మారంపల్లి రాజు, లక్కే సాగర్, బొల్లె జాషువాలను ఎంపిక చేశారు. కార్యవర్గ సభ్యులుగా జింక గౌతమి, ఎర్రోళ్ల బాలకృష్ణలను నియమించగా, ప్రేరణ ఇన్‌చార్జిగా ఆకుల మహేష్ గౌడ్‌కు బాధ్యతలు అప్పగించారు.

ఈ సందర్భంగా బొర్ర సురేష్ కుమార్ మాట్లాడుతూ.. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ జ్ఞానవంతమైన, చైతన్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా స్వేరోస్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం అనే మూడు ప్రధాన అంశాలను ప్రాతిపదికగా తీసుకొని సమాజంలో విద్య, ఆరోగ్యం, ఆర్థిక స్వావలంబనపై అవగాహన కల్పించేందుకు స్వేరోస్ కృషి చేస్తోందని పేర్కొన్నారు. యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు విద్యార్థులు, యువతకు సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించడం స్వేరోస్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. యువత శారీరకంగా దృఢంగా ఉండేందుకు ఫిట్ ఇండియా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నట్లు వివరించారు. విద్య ద్వారానే సమాజంలో సమానత్వం, సామాజిక చైతన్యం సాధ్యమవుతాయని, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు.

నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులు ఐక్యంగా పనిచేస్తూ స్వేరోస్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, విద్యార్థులు, యువత అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, స్వేరోస్ లక్ష్యాల సాధనకు అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు. జిల్లాలో సంస్థను మరింత బలోపేతం చేస్తూ విద్య, ఆరోగ్యం, ఆర్థిక అభివృద్ధి అంశాలపై విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మరియు కరీంనగర్ ఇన్చార్జ్ తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మికి 12 ఏళ్లు.. బీఆర్ఎస్ సంబరాలు

**బలగం టీవీ, కోరుట్ల**

పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి పథకం ప్రారంభమై 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

కోరుట్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోనూ బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు.



# జపాన్‌లో చక్ దే ఇండియా

## ఆసియా గేమ్స్‌లో స్వర్ణం సాధించిన భారత మహిళల హాకీ జట్టు!

**44 ఏళ్ల నిరీక్షణకు తెర**

బలగం టీవీ, నగోయా

ఆసియా గేమ్స్‌లో భారత మహిళల హాకీ జట్టు అద్భుత ఘనత సాధించింది. పట్టుదలతో కూడిన అద్వితీయ ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని ముద్దాడి 44 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది. శుక్రవారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లో భారత్ 1-0 తేడాతో చైనాపై ఘనవిజయం సాధించింది. భారత క్రీడాకారిణి లాల్‌రెమ్‌సియామి చేసిన ఏకైక గోల్ మ్యాచ్‌లో నిర్ణయాత్మకంగా మారింది. అంతకుముందు భారత మహిళల జట్టు చివరిసారిగా 1982 ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం గెలుచుకుంది. ఈ చారిత్రాత్మక విజయంతో భారత జట్టు 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించి డబుల్ రికార్డు సృష్టించింది.

ఉత్కంఠభరితంగా ఫైనల్ పోరు.. సవితా పునియా ఉక్కు గోడ

జపాన్‌లోని నగోయా వేదికగా జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో భారత్, చైనా జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. మ్యాచ్ తొలి క్వార్టర్‌లోనే భారత ప్లేయర్ లాల్‌రెమ్‌సియామి మెరుపు వేగంతో ఫీల్డ్ గోల్ కొట్టి భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించింది. ఆరంభంలో వెనుకబడిన చైనా స్కోరును సమం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించింది. చివరి పావుగంటలో చైనా తమ గోల్ కీపర్‌ను ఉపసంహరించుకుని అదనపు అటాకర్‌ను బరిలోకి దించినప్పటికీ, భారత గోల్ కీపర్ సవితా పునియా ఉక్కు గోడలా నిలబడి ప్రత్యర్థి ప్రయత్నాలను తిప్పికొట్టింది. ఆఖరి నిమిషాల్లో సలీమా టెటే, రుతుజ డిఫెన్స్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తూ చాకచక్యంగా సమయాన్ని గడపడంతో భారత్ విజయం ఖాయమైంది.

లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు అర్హత.. క్రీడా లోకం హర్షం

సెమీఫైనల్లో దక్షిణ కొరియాపై 2-0 తేడాతో గెలిచి ఫైనల్ చేరిన భారత్, ఆఖరి పోరులోనూ అదే ఊపును కొనసాగించి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. మ్యాచ్ ముగిసి విజిల్ మోగగానే భారత




క్రీడాకారిణుల విజయ సంబరాలతో స్టేడియం హోరెత్తింది. ఈ విజయంతో ప్రస్తుత ఆసియా క్రీడల్లో భారత్ సాధించిన స్వర్ణ పతకాల సంఖ్య 16కు చేరింది. 44 ఏళ్ల తర్వాత లభించిన ఈ చారిత్రాత్మక పసిడి విజయంపై దేశవ్యాప్తంగా క్రీడాభిమానులు, ప్రముఖులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## అంకుశ్ పంగల్‌కు పసిడి పతకం!

బలగం టీవీ, నగోయా

ఆసియా క్రీడల బాక్సింగ్ పోటీల్లో భారత బాక్సర్లు సత్తా చాటారు. పురుషుల 80 కేజీల విభాగంలో భారత సుబేదార్ బాక్సర్ అంకుశ్ పంగల్ అద్భుత ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఫైనల్ పోరులో దక్షిణ కొరియాకు చెందిన బలమైన ప్రత్యర్థి కిమ్ మిన్ సియాంగ్‌పై తొలి రౌండ్ నుంచే అంకుశ్ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. తన పవర్‌ఫుల్ పంచ్‌లతో ప్రత్యర్థిని కోలుకోకుండా చేస్తూ ఫస్ట్, సెకండ్ రౌండ్లలో పైచేయి సాధించారు. మ్యాచ్ ముగిసేసరికి నలుగురు జడ్జీలు ఏకగ్రీవంగా అంకుశ్‌కు అనుకూలంగా తీర్పు నిచ్చారు.

ఒకే రోజు మూడు స్వర్ణాలు.. అమిత్ పంగల్ తర్వాత అంకుశ్ ఘనత

ఈ రోజు జరిగిన బాక్సింగ్ ఈవెంట్లలో భారత్ ఏకంగా మూడు స్వర్ణ పతకాలతో రికార్డు సృష్టించింది. ఆసియా గేమ్స్ పురుషుల బాక్సింగ్‌లో 2018లో అమిత్ పంగల్ పసిడి సాధించగా, మళ్లీ సుదీర్ఘ కాలం తర్వాత భారత్‌కు స్వర్ణం అందించిన బాక్సర్‌గా అంకుశ్ పంగల్ చరిత్రకెక్కారు. నగోయా వేదికగా భారత బాక్సర్లు పంచ్ పవర్‌తో పసిడి పంట పండించడంతో దేశవ్యాప్తంగా క్రీడాభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## రికర్వ్ ఆర్చరీలో భారత్‌కు చారిత్రక గోల్డ్..



బలగం టీవీ, నగోయా

ఆసియా క్రీడలు 2026లో భారత మహిళా రికర్వ్ ఆర్చరీ జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. శుక్రవారం నాగోయా వేదికగా జరిగిన మహిళల రికర్వ్ టీమ్ ఫైనల్ ఈవెంట్‌లో భారత ఆర్చర్లు స్వర్ణ పతకాన్ని ముద్దాడారు. ఒలింపిక్స్, ఆసియా గేమ్స్‌లో తిరుగులేని ఆధిపత్యం చెలాయించే 10 సార్లు ఒలింపిక్ ఛాంపియన్ దక్షిణ కొరియాను తీవ్ర ఒత్తిడిలోనూ చిత్తు చేసి, తొలిసారి ఆసియా గేమ్స్ మహిళల రికర్వ్ ఈవెంట్‌లో భారత్‌కు పసిడి అందించి కొత్త చరిత్ర లిఖించారు.

**కొరియాపై 5-3తో సంచలన విజయం**

అంకిత భకత్, క్రీతి శర్మ, కుమ్‌కుమ్ మోహద్‌లతో కూడిన భారత త్రయం అత్యంత ప్రతికూల వాతావరణంలో, ఈదురు గాలులను తట్టుకుంటూ అద్భుత ప్రదర్శన కనబరిచారు. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోరులో కొరియాపై 5-3 తేడాతో ఘన విజయం సాధించారు.

తొలి రెండు సెట్లు: రెండు జట్లూ హోరాహోరీగా తలపడటంతో చెరో పాయింట్‌తో 2-2తో సమంగా నిలిచాయి.

మూడో సెట్: కొరియా ఆర్చర్ల తప్పిదాన్ని సొమ్ము చేసుకున్న భారత ఆర్చర్లు 55 పాయింట్లు సాధించి 4-2తో ఆధిక్యంలోకి దూసుకెళ్లారు.

నాలుగో సెట్: ఆఖరి సెట్‌లో తీవ్ర ఒత్తిడిలో పడిన కొరియా 54 పాయింట్లు చేసింది. భారత అమ్మాయిలు కూడా సరిగ్గా 54 పాయింట్లు సాధించడంతో ఈ సెట్ టై అయింది. దీంతో ఒక పాయింట్ భారత్‌కు దక్కడంతో 5-3 తేడాతో చారిత్రాత్మక పసిడి ఖాయమైంది.

ఫైనల్ బాటలో అద్భుత జోరు

ట్రయల్స్‌లో విఫలమైన మాజీ వరల్డ్ నంబర్ వన్ దీప్తి కుమారి స్థానంలో వచ్చిన యంగ్ ఆర్చర్ కీర్తి శర్మ, అంకిత, కుమ్‌కుమ్‌లతో కలిసి తిరుగులేని ఫామ్ కనబరిచింది. సెమీఫైనల్లో చైనాను 5-1 తేడాతో చిత్తు చేసిన భారత్, 2023 హాంగ్‌జౌ ఆసియా గేమ్స్‌లో సాధించిన కాంస్య పతకం రికార్డును తిరగరాస్తూ ఈసారి పసిడి వెలుగులు నింపింది.



## భారత రెజర్ అద్భుత పోరాటం

**సుజీత్ కల్‌కల్‌కు పసిడి పతకం!**

బలగం టీవీ, నగోయా

ఆసియా క్రీడల్లో భారత రెజ్లర్ సుజీత్ కల్‌కల్ అద్భుత ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని ముద్దాడారు. పురుషుల 65 కేజీల ఫ్రీస్టైల్ కేటగిరీ ఫైనల్లో ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో అనూహ్యంగా పుంజుకుని విజయాన్ని కైవసం చేసుకున్నారు. తొలుత తీవ్ర ఒత్తిడిలో కనిపించిన సుజీత్, ఆ తర్వాత రెండో రౌండ్‌లో చూపిన అసాధారణ పోరాట పటిమతో తజికిస్తాన్ ఆటగాడు అబ్దుల్‌మజీద్ కుదేవ్‌ను 10-9 తేడాతో మట్టికరిపించి బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నారు.

తొలి రౌండ్‌లో వెనుకబడినా.. సెకండ్ రౌండ్‌లో స్టన్నింగ్ కంబ్యాక్!

ఫైనల్ మ్యాచ్ తొలి రౌండ్‌లో తజిక్ ప్లేయర్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించడంతో సుజీత్ 2-9 తేడాతో తీవ్రంగా వెనుకబడ్డారు. అయితే ధైర్యం కోల్పోకుండా రెండో రౌండ్‌లో బరిలోకి దిగిన భారత రెజ్లర్ దెబ్బకి దెబ్బ తీశారు. ప్రత్యర్థికి ఒక్క పాయింట్ కూడా ఇవ్వకుండా ఏకంగా 8-0 తేడాతో రెండో రౌండ్‌ను క్లీన్ స్వీప్ చేశారు. దీంతో ఓవరాల్‌గా 10-9 తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసి పసిడి పతకాన్ని ముద్దాడారు.

75 పతకాలతో భారత్ గోల్డ్ రష్!

ఈ గేమ్స్‌లో భారత అథ్లెట్ల విజయ పరంపర నిరంతరాయంగా కొనసాగుతోంది. పురుషుల 80 కేజీల బాక్సింగ్‌లో అంకుశ్ పంగల్ సాధించిన పసిడితో పాటు, సుజీత్ సాధించిన ఈ స్వర్ణంతో భారత్ పతకాల సంఖ్య రికార్డు స్థాయిలో 75కు చేరింది. ఇందులో 15 స్వర్ణాలు, 25 రజతాలు, 35 కాంస్య పతకాలు ఉన్నాయి.

## రికర్వ్ పురుషుల టీమ్‌కు రజత పతకం!

బలగం టీవీ, నగోయా

ఆసియా క్రీడలు 2026లో భారత ఆర్చర్లు అద్భుత ప్రదర్శనను కొనసాగిస్తున్నారు. శుక్రవారం జపాన్‌లోని ఒకాజాకి చువో సోగో పార్క్ మల్టీపర్పస్ స్క్వేర్‌లో జరిగిన రికర్వ్ పురుషుల టీమ్ ఈవెంట్ ఫైనల్లో భారత పురుషుల జట్టు రజత పతకాన్ని సొంతం చేసుకుంది. ధీరజ్ బొమ్మదేవర, యశ్‌దీప్ భోగే, నీరజ్ చౌహాన్‌లతో కూడిన భారత త్రయం టోర్నీ అంతటా నిలకడగా రాణించి ఫైనల్ చేరుకున్నప్పటికీ, స్వర్ణ పతక పోరులో బలమైన దక్షిణ కొరియా చేతిలో ఓటమి పాలైంది.

ఉత్కంఠభరితంగా ఫైనల్.. కొరియన్ల ఆధిపత్యం

లీ ఊ-సియోక్, కిమ్ జె-డియోక్, కిమ్ ఊ-జిన్‌లతో కూడిన దక్షిణ కొరియా జట్టు ఫైనల్లో పూర్తి స్థాయిలో విజృంభించింది. సెట్ పాయింట్ల ఆధారంగా కొరియా జట్టు 5-1 తేడాతో భారత్‌ను ఓడించి, ఆసియా గేమ్స్ రికర్వ్ విభాగంలో వరుసగా రెండోసారి పసిడి పతకాన్ని ముద్దాడింది. మ్యాచ్ ప్రారంభంలో భారత బాణీలు గట్టి పోటీనిచ్చినప్పటికీ,




కీలకమైన సెట్లలో కొరియన్ ఆర్చర్లు ఒత్తిడిని జయించి ఆధిక్యాన్ని కాపాడుకున్నారు. పసిడి చేజారినప్పటికీ, ఐచి-నాగోయా 2026 క్రీడల్లో భారత్‌కు ఇది మరొక అత్యంత విలువైన పతకంగా నిలిచింది.

మహిళల స్వర్ణాన్ని కొనియాడిన ధీరజ్ బొమ్మదేవర

అంతకుముందు భారత మహిళల రికర్వ్ జట్టు దక్షిణ కొరియాను 5-3 తేడాతో ఓడించి ఆసియా గేమ్స్ చరిత్రలోనే తొలి స్వర్ణ పతకం సాధించి సరికొత్త చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. పురుషుల విభాగంలో వెండి పతకం సాధించిన అనంతరం భారత స్టార్ ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర మీడియాతో మాట్లాడుతూ సంతోషం వ్యక్తం చేశారు. "ముందుగా చారిత్రాత్మక స్వర్ణం సాధించిన మన మహిళల జట్టుకు నా హృదయపూర్వక అభినందనలు. వారి విజయం మాలో కొండంత ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ఈ రోజు మాకు దక్కిన ఈ పతకంతో ఎంతో సంతోషంగా ఉన్నాం. ఆఖరి బాణం వరకు మేము పోరాడుతూనే ఉంటాం. జట్టులోని జూనియర్ల నుంచి కూడా నేను చాలా విషయాలు నేర్చుకున్నాను. మా మధ్య ఉన్న సమిష్టితత్వమే ఈ విజయాలకు కారణం" అని ధీరజ్ పేర్కొన్నారు.




## రెడ్ బాల్ క్రికెట్‌కు చాహల్ గుడ్‌బై

**నెరవేరని టెస్ట్ క్యాప్ కల!**

బలగం టీవీ, హైదరాబాద్

టీమిండియా వెటరన్ లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ రెడ్ బాల్ (సుదీర్ఘ) ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్‌తో పాటు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌కు కూడా రిటైర్మెంట్ ఇస్తున్నట్లు అధికారికంగా ప్రకటించాడు. కౌంటీ క్రికెట్‌లో భాగంగా లార్డ్స్ మైదానంలో తన చివరి ఫస్ట్ క్లాస్ మ్యాచ్ పూర్తయిన అనంతరం చాహల్ ఈ సంచలన నిర్ణయాన్ని వెల్లడించాడు. దీంతో భారత్ తరపున టెస్ట్ మ్యాచ్ ఆడి 'టెస్ట్ క్యాప్' అందుకోవాలనే అతని కల నెరవేరకుండానే మిగిలిపోయింది. అయితే పరిమిత ఓవర్ల (వైట్‌బాల్) క్రికెట్‌లో మాత్రం రీఎంట్రీ కోసం తన ప్రయత్నాలు కొనసాగుతాయని స్పష్టం చేశాడు.

నెరవేరని కలపై చాహల్ భావోద్వేగం

తన రిటైర్మెంట్ నిర్ణయంపై చాహల్ స్పందిస్తూ.. "భారత్ తరపున టెస్ట్ క్యాప్ అందుకోవడం నా కెరీర్‌లో అతిపెద్ద కల. కానీ ఇకపై అది నెరవేరకపోవచ్చు. ఈ ఫార్మాట్‌లో ఇప్పటివరకు సాగిన నా ప్రయాణం ఎంతో సంతృప్తిని ఇచ్చింది. రెడ్ బాల్ క్రికెట్ అనేది కేవలం ఓ ఫార్మాట్ మాత్రమే కాదు.. ఆటగాళ్లకు ఓపిక, క్యారెక్టర్, మైదానంలో గంటల తరబడి శ్రమించడంలో ఉండే అసలైన సంతోషాన్ని పరిచయం చేస్తుంది" అని తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు.

17 ఏళ్ల ఫస్ట్ క్లాస్ కెరీర్ విశేషాలు

తొలి మ్యాచ్: హర్యానా తరపున 2009లో ఫస్ట్‌క్లాస్ కెరీర్‌ను ప్రారంభించాడు.

ట్రాక్ రికార్డ్: 17 ఏళ్ల కెరీర్‌లో 49 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడి, 32.27 యావరేజ్‌తో 148 వికెట్లు నేలకూల్చాడు.

కౌంటీల్లో సత్తా: ఇంగ్లండ్ నార్తాంప్టన్‌షైర్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహించిన చాహల్, కౌంటీ చాంపియన్‌షిప్‌లో 6 మ్యాచ్‌ల్లోనే 16.14 సగటుతో 21 వికెట్లు తీసి అదరగొట్టాడు.

చివరి మ్యాచ్: లార్డ్స్‌లో మిడిల్‌సెక్స్‌తో జరిగిన మ్యాచ్ చాహల్‌కు చివరి ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌గా నిలిచింది.

లభించని టెస్ట్ అవకాశం.. కారణమిదే!

టీమిండియా టెస్ట్ జట్టులో రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజాలు సుదీర్ఘ కాలం అద్భుత ప్రదర్శన చేయడంతో పాటు, వారిద్దరికీ బ్యాటింగ్ చేసే సామర్థ్యం ఉండటంతో చాహల్‌కు అవకాశాలు దక్కలేదు. సరైన బ్యాటింగ్ నైపుణ్యం లేకపోవడం, ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు కూడా క్రమంగా తగ్గించేయడం చాహల్ ఎంపికకు ప్రతిబంధకంగా మారాయి.

భారత్ తరపున ఇప్పటివరకు 72 వన్డేలు, 80 టీ20లు ఆడిన చాహల్.. ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా కొనసాగుతున్నాడు. ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న చాహల్, ఇకపై పూర్తి దృష్టిని పరిమిత ఓవర్ల క్రికెట్‌పైనే నిమగ్నం చేయనున్నాడు.

## లవ్లీనా బోర్గోహైన్ చారిత్రాత్మక విజయం!

**బర్త్‌డే గిఫ్ట్‌గా పసిడి పతకం**

బలగం టీవీ, నగోయా

నిషియో (జపాన్): భారత స్టార్ బాక్సర్, టోక్యో ఒలింపిక్ కాంస్య విజేత లవ్లీనా బోర్గోహైన్ తన పుట్టినరోజున మరిచిపోలేని అద్భుత కానుకను సొంతం చేసుకున్నారు. శుక్రవారం ఐచి-నాగోయా వేదికగా జరిగిన ఆసియా గేమ్స్ 2026 మహిళల 75 కేజీల బాక్సింగ్ విభాగంలో లవ్లీనా స్వర్ణ పతకాన్ని ముద్దాడారు. నిషియో జిమ్నాసియంలో జరిగిన రసవత్తర ఫైనల్ పోరులో చైనాకు చెందిన బావో జియాపై 5-0తో ఏకగ్రీవ తీర్పుతో (Unanimous Decision) తిరుగులేని విజయం సాధించారు. 2022 హాంగ్‌జౌ ఆసియా గేమ్స్‌లో సాధించిన రజతాన్ని ఈసారి పసిడిగా మార్చుకుంటూ రింగ్ లో తన ఆధిపత్యాన్ని చాటారు.

మేరీ కోమ్ తర్వాత లవ్లీనా మాత్రమే: చారిత్రాత్మక ఘనత

ఈ చారిత్రాత్మక విజయంతో లవ్లీనా భారత బాక్సింగ్ చరిత్రలో ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించారు. ఆసియా గేమ్స్ బాక్సింగ్‌లో స్వర్ణ




పతకం సాధించిన రెండో భారతీయ మహిళా బాక్సర్‌గా లవ్లీనా నిలిచారు. అంతకుముందు 2014 ఇన్చియోన్ ఆసియా క్రీడల్లో దిగ్గజ బాక్సర్ మేరీ కోమ్ (51 కేజీలు) మాత్రమే భారత్ తరపున పసిడి గెలిచారు. మళ్లీ 12 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆసియా గేమ్స్ మహిళల బాక్సింగ్‌లో భారత్‌కు లవ్లీనా స్వర్ణం అందించి మేరీ కోమ్ సరసన నిలిచారు.

క్లిష్టమైన బాటలో అద్భుత ప్రదర్శన

ఈ టోర్నీలో ఫైనల్ చేరే క్రమంలో లవ్లీనా అసాధారణ నిలకడ, పోరాట పటిమను ప్రదర్శించారు. క్వార్టర్ ఫైనల్లో దక్షిణ కొరియాకు చెందిన సీయాంగ్ సుయాన్‌పై 5-0తో ఘనవిజయం సాధించిన ఆమె, సెమీఫైనల్లో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్, కజకిస్థాన్‌కు చెందిన నటాల్యా బొగ్డానోవాపై 3-2 తేడాతో తీవ్రంగా పోరాడి విజయం సాధించారు. గ్లాస్గోలో జరిగిన 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో రజతం గెలిచిన లవ్లీనా, ఈసారి పుట్టినరోజు నాడే ఆసియా గేమ్స్ స్వర్ణంతో తన పతకాల బోణీని మరింత ఘనంగా మార్చుకున్నారు.

## నేడు పాకిస్థాన్‌తో భారత్ గోల్డ్ మెడల్ ఫైట్..



**తుది జట్టుపై సర్వత్రా ఆసక్తి!**

బలగం టీవీ, నగోయా

ఆసియా క్రీడలు 2026 పురుషుల క్రికెట్ పోటీల్లో భారత జట్టు తుది పోరుకు సిద్ధమైంది. శనివారం దాయాది పాకిస్థాన్‌తో జరగనున్న ప్రతిష్టాత్మక స్వర్ణ పతక పోరులో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. సెమీఫైనల్లో శ్రీలంకను 124 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసిన భారత్, అదే జోరుతో పాకిస్థాన్‌ను కూడా ఓడించి పసిడి పతకాన్ని కైవసం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. జపాన్‌లోని నిషిన్ వేదికగా జరగనున్న ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం 10:30 గంటలకు ప్రారంభం కానుంది.

**వర్షం ముప్పు.. రద్దయితే భారత్‌దే స్వర్ణం!**

ఈ కీలకమైన ఫైనల్ మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉండటం అభిమానులను కలవరపెడుతోంది. ఇప్పటికే వాతావరణం అనుకూలించక క్వార్టర్ ఫైనల్స్ రద్దయిన సంగతి తెలిసిందే. పాకిస్థాన్-బంగ్లాదేశ్ మధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌కూ వర్షం అంతరాయం కలిగించింది. ఒకవేళ వాతావరణం సహకరించక ఫైనల్ మ్యాచ్ పూర్తిగా రద్దయితే, అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానంలో ఉన్న భారత జట్టునే విజేతగా ప్రకటించి స్వర్ణ పతకాన్ని అందజేస్తారు.

**ఓపెనర్‌గా వైభవ్ విధ్వంసం.. స్పిన్ కాంబినేషన్‌తో భారత్!**

పాకిస్థాన్‌తో పోలిస్తే కాగితంపై భారత జట్టే హాట్ ఫేవరెట్‌గా కనిపిస్తున్నప్పటికీ, దాయాది పోరు కావడంతో తుది జట్టు ఎంపికపై తీవ్ర ఆసక్తి నెలకొంది. లంకతో మ్యాచ్‌లో సీనియర్లు విఫలమైన వేళ టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆకట్టుకోవడంతో అతడు ఓపెనర్‌గా కొనసాగడం ఖాయమైంది. జపాన్‌లోని పిచ్‌లు స్పిన్‌కు అనుకూలిస్తుండటంతో ఏకైక ఫాస్ట్ బౌలర్‌గా జస్‌ప్రీత్ బుమ్రాను ఆడించి, శివమ్ దూబేను పేస్ ఆల్ రౌండర్‌గా ఉపయోగించే వ్యూహాన్ని ఫైనల్లోనూ కొనసాగించే అవకాశం ఉంది.

**పాకిస్తాన్‌తో ఫైనల్ ఆడే భారత సంభావిత జట్టు: అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, శివమ్ దూబే, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, జస్‌ప్రీత్ బుమ్రా.**

## ఆసియా క్రీడల్లో భారత్‌కు 76 పతకాలు

**16 స్వర్ణాలు, 25 రజతాలు, 35 కాంస్యాలతో ఐదో స్థానంలో భారత్**

బలగం టీవీ, హైదరాబాద్

ఆసియా క్రీడల్లో భారత్ పతకాల సంఖ్య 76కు చేరింది. పోటీల 13వ రోజు ముగిసే సమయానికి భారత్ 16 స్వర్ణాలు, 25 రజతాలు, 35 కాంస్యాలతో మొత్తం 76 పతకాలు సాధించి పతకాల పట్టికలో ఐదో స్థానంలో నిలిచింది.

162 స్వర్ణాలు, 81 రజతాలు, 73 కాంస్యాలతో మొత్తం 316 పతకాలతో చైనా అగ్రస్థానంలో కొనసాగుతోంది. జపాన్ 70 స్వర్ణాలు, 84 రజతాలు, 85 కాంస్యాలతో 239 పతకాలతో రెండో స్థానంలో ఉంది. దక్షిణ కొరియా 33 స్వర్ణాలు, 39 రజతాలు, 62 కాంస్యాలతో 134 పతకాలతో మూడో స్థానంలో ఉంది. ఉజ్బెకిస్థాన్ 20 స్వర్ణాలు, 23 రజతాలు, 22 కాంస్యాలతో 65 పతకాలతో నాలుగో స్థానంలో ఉంది.

భారత్ తర్వాత ఇరాన్ 45, థాయ్‌లాండ్ 43, కజకిస్థాన్ 77, బహ్రెయిన్ 22, మలేషియా 30 పతకాలతో తదుపరి స్థానాల్లో ఉన్నాయి.

# నడవలేని స్థితిలో సీనియర్ నట

సీనియర్ నటి శారద గురించి తెలుగు ఆడియెన్స్ కు ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. వందలాది సినిమాల్లో నటించి మెప్పించిన ఆమె . తన నటనా ప్రతిభకు ప్రతీకగా ఏకంగా జాతీయ ఉత్తమ నటి అవార్డు కూడా అందుకున్నారు. మొదట హీరోయిన్ గా నటించిన శారద ఆ తర్వాత క్రమంగా సహాయక నటిగా మారిపోయారు. కేవలం తెలుగులోనే కాదు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లోనూ నటించి మెప్పించారు శారద. మూడుసార్లు జాతీయ ఉత్తమ నటి అవార్డులు, రెండు సార్లు ఫిలిం ఫేర్ అవార్డులు.. ఇలా శారద కీర్తి కిరీటంలో ఎన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు, ప్రశంసలు ఉన్నాయి. 1955లో వచ్చిన 'కన్యా శుల్కం' సినిమాతో వెండితెరకు పరిచయమయ్యారు శారద. ఆ తర్వాత ఇద్దరు మిత్రులు, బలిపీఠం, శారద, దాన వీర శూర కర్ణ, తెనాలి రామకృష్ణ, స్వయంవరం ,నిమజ్జనం , ఊర్వశి, ఇంద్ర ధనుస్సు, ప్రతిధ్వని, జస్టిస్ చౌదరి, అత్తా కోడళ్లు, సర్దార్ పాపారాయుడు, అమ్మ రాజీనామా, ఏవండి ఆవిడ వచ్చింది, మేజర్ చంద్రకాంత్, అంతఃపురం, స్టాలిన్, యోగి, సుకుమారుడు.. ఇలా ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో శారద నటించారు. కాగా ప్రస్తుతం సినిమా ఇండస్ట్రీకి పూర్తిగా దూరంగా ఉంటున్నారు శారద. చివరిగా 2013లో సుకుమారుడు అనే సినిమాలో కనిపించారామె. ఈ మధ్యన పెద్దగా బయట కనిపించని ఆమె తాజాగా చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. అయితే ఈ



ఈవెంట్ లో ఆమె సరిగ్గా నడవలేని పరిస్థితిలో కనిపించారు. ఈ ఈవెంట్ లో పక్కనున్న వారి సహాయంతో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు శారద. ప్రస్తుతం ఈ సీనియర్ నటికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. వీటిని చూసిన సినీ అభిమానులు, నెటిజన్లు షాక్ అవుతున్నారు. ఆరోగ్యం పరంగా మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. శారద వయసు సుమారు 80 ఏళ్లు. ప్రస్తుతం ఆమె ఎక్కువగా ఇంట్లోనే ఉంటున్నారు. కాగా శారద రెండు సార్లు పెళ్లి చేసుకున్నారు అయినా పిల్లలు లేకపోవడంతో ప్రస్తుతం చెన్నైలోని తన సోదరుడి కుటుంబంతో కలిసి జీవిస్తున్నారీ సీనియర్ నటి.

# అక్టోబర్ 5న 'జైలర్ 2' ట్రైలర్

సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న 'జైలర్ 2' సినిమాకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చేసింది. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ అధికారిక థియేట్రికల్ ట్రైలర్‌ను అక్టోబర్ 5, 2026న విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అధికారికంగా ప్రకటించింది. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన 'జైలర్'కు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో, కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఇప్పటికే యూట్యూబ్‌లో ఈ సినిమా పేరుతో అనేక ఫ్యాన్-మేడ్, కాన్సెప్ట్ ట్రైలర్లు చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో, అక్టోబర్ 5న రాబోయేది అఫీషియల్ ట్రైలర్ అని మేకర్స్ స్పష్టతనిచ్చారు. ఈ చిత్రంలో రజనీకాంత్ మరోసారి తన ఐకానిక్ 'టైగర్' ముత్తువేల్ పాండియన్ పాత్రలో కనిపించి ప్రేక్షకులను అలరించనున్నారు. ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ అందిస్తున్న సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఇప్పటికే విడుదలైన 'హుకుమ్ రీలోడెడ్' థీమ్ సాంగ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసిం ది. తారాగణం పరంగా కూడా ఈ సీక్వెల్ మరింత భారీగా ఉండనుంది. ఎస్.జె. సూర్య, విద్యాబాలన్, మిథున్ చక్రవర్తి ముఖ్య పాత్రలు పోషిస్తుండగా, తొలి భాగంలో అదరగొట్టిన మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్



లతో పాటు ఈసారి విజయ్ సేతుపతి కూడా ప్రత్యేక అతిథి పాత్రలో మెరవనున్నారు. దీంతో 'జైలర్ 2'పై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# వరుణ్ సందేశ్, శ్వేతా బసు 'నా వైఫ్ మిస్సింగ్'..

'కొత్త బంగారు లోకం' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్ జంట చాలా కాలం తర్వాత మళ్లీ తెరపైకి రాబోతోంది. వీరిద్దరూ ప్రధాన పాత్రల్లో 'ఆహా' ఓటీటీ సమర్పిస్తున్న సరికొత్త ఒరిజినల్ సిరీస్ 'నా వైఫ్ మిస్సింగ్'. వినూత్నమైన కంటెంట్‌తో సబ్‌స్క్రైబర్లను నిరంతరం ఆకట్టుకుంటున్న ఆహా, ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌తో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. భార్య కనపడటం లేదంటూ ఒక భర్త పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ కథ మొదలవుతుంది. ఈ కేసులో నిజమేంటి అనే అంశం చుట్టూ కథనం సాగుతుందని తెలుస్తోంది. ఇటీవల ఆహా విడుదల చేసిన అప్‌డేట్‌లో "ప్రతి కేసుకు ఒక కథ ఉంటుంది, ఈ కేస్ లో నిజం ఏంటి?" అనే క్యాప్షన్ ప్రేక్షకులలో క్యూరియాసిటీని మరింత పెంచింది. తన భార్య మిస్సయ్యిందంటూ వరుణ్ సందేశ్ కంప్లైంట్ ఇవ్వడం, దాని వెనుక ఉన్న రహస్యం ఏమిటనేది సిరీస్‌లో ఉత్కంఠభరితంగా చూపించనున్నారని సమాచారం. వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్‌లది టాలీవుడ్‌లో ఒక సక్సెస్‌ఫుల్ పెయిర్. 'కొత్త బంగారు లోకం' తర్వాత వీరిద్దరూ కలిసి నటిస్తున్న ప్రాజెక్ట్ ఇదే కావడంతో సిరీస్‌పై అంచనాలు సహజంగానే పెరిగాయి. చాలా ఏళ్ల తర్వాత ఈ జంట మళ్లీ కలిసి నటించడం ఈ ప్రాజెక్ట్‌కు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఈ సిరీస్‌ను తెలుగుతో పాటు తమిళ భాషల్లో కూడా ఒకేసారి అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆహా ప్రకటించింది. మిస్సింగ్ కేసు వెనుక ఉన్న మిస్టరీ ఏంటి? నిజంగానే శ్వేతా బసు పాత్ర అదృశ్యమైందా? లేక దీని వెనుక ఇంకేదైనా కుట్ర ఉందా? అనే ప్రశ్నలకు సమాధానం తెలియాలంటే సిరీస్ చూడాల్సిందే. త్వరలోనే 'నా వైఫ్ మిస్సింగ్' స్ట్రీమింగ్ తేదీని అధికారికంగా ప్రకటిస్తామని ఆహా టీమ్ తెలిపింది.




# మళ్లీ తెరపైకి 'ఆరుగురు పతివ్రతలు'




టాలీవుడ్‌లో ప్రస్తుతం రీ-రిలీజ్ ట్రెండ్ జోరుగా సాగుతోంది. పాత కాలపు బ్లాక్ బస్టర్ హిట్లు, ప్రేక్షకుల మనస్సుల్లో నిలిచిపోయిన కల్ట్ క్లాసిక్ సినిమాలను నూతన 4కే టెక్నాలజీతో మళ్లీ థియేటర్లలోకి తీసుకువస్తున్నారు. మాస్ యాక్షన్ చిత్రాలతో పాటు వినూత్నమైన కంటెంట్‌తో వచ్చిన సినిమాలకు కూడా నేటి తరం అభిమానులు బ్రహ్మరథం పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం తన బోల్డ్ అండ్ రియలిస్టిక్ కంటెంట్‌తో టాలీవుడ్‌లో పెద్ద సెన్సేషన్ సృష్టించిన కల్ట్ క్లాసిక్ మూవీ 'ఆరుగురు పతివ్రతలు'మళ్లీ థియేటర్లలోకి రావడానికి సిద్ధమైంది. దివంగత ప్రముఖ డైరెక్టర్ ఈవీవీ సత్యనారాయణ తన సొంత నిర్మాణ సంస్థ "ఈవీవీ సినిమా" బ్యానర్‌పై ఈ సినిమాను స్వయంగా నిర్మించి, దర్శకత్వం వహించారు. 2004 ఫిబ్రవరి 6న విడుదలైన ఈ సినిమా అప్పట్లో తన విభిన్నమైన పోస్టర్లు, బోల్డ్ కథాంశంతో బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సాధించింది. ఇప్పుడు సరిగ్గా 22 ఏళ్ల తర్వాత పోచమ్మ ఫిల్మ్స్ సమర్పణలో అక్టోబర్ 29న రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను గ్రాండ్‌గా రీ-రిలీజ్ చేయనున్నట్లు నిర్మాతలు అధికారిక పోస్టర్ ద్వారా వెల్లడించారు. ఆరుగురు చిన్ననాటి స్నేహితురాళ్లు తమ వైవాహిక జీవితంలో ఎదుర్కొంటున్న అనుభవాలు, భర్తల నైజాలు, సంసారంలో తలెత్తే ఆటుపోట్లను ఒకరితో ఒకరు పంచుకోవడం చుట్టూ ఈ కథ సాగుతుంది. పెళ్లి వ్యవస్థలో మహిళలు ఎదుర్కొనే మానసిక సంఘర్షణలు, భర్తల అనుమానాస్పద ధోరణి, నిర్లక్ష్యం వల్ల కాపురాల్లో వచ్చే పరిణామాలను డైరెక్టర్ ఈవీవీ సత్యనారాయణ అత్యంత సహజంగా తెరకెక్కించారు. దాంపత్య జీవితంలోని ఈగోలను, మోసాలను హాస్యభరితంగా చూపిస్తూనే ఆలోచింపజేసేలా రూపొందించిన ఈ సినిమా అప్పట్లో విమర్శకుల ప్రశంసలు అందుకుంది.




# ఇరుముడి తర్వాత మరో డిఫరెంట్ మూవీ



మాస్ మహారాజా రవితేజ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. తనదైన ఎనర్జీ, కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరించే ఆయన.. ఇటీవల ఇరుముడి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. రవితేజ- శివ నిర్వాణ కాంబినేషన్‌లో తెరకెక్కిన ఈ సినిమా థియేటర్లలో బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ సినిమా రూ.250 కోట్లకు పైగా వసూళ్లతో సత్తా చాటింది. ఓటీటీలో కూడా దుమ్మురేపుతోంది. తాజాగా నెట్‌ఫ్లిక్స్ ప్రకటించిన గ్లోబల్ టాప్-10 నాన్-ఇంగ్లీష్ సినిమాల జాబితాలో టాప్ ప్లేస్‌లో నిలిచింది. ఇలాంటి భారీ విజయాన్ని అందుకున్న రవితేజ నెక్స్ట్ మూవీ ఏంటి? ఎలాంటి కథను ఎంచుకోబోతున్నారు? అనే ఆసక్తి అభిమానుల్లో మొదలైంది. రవితేజ నెక్స్ట్ మూవీని దర్శకుడు వివేక్ ఆత్రేయతో చేయబోతున్నారట. మెంటల్ మదిలో, బ్రోచేవారెవరురా, అంటే సుందరానికి, సరిపోదా శనివారం వంటి సినిమాలతో వివేక్ ఆత్రేయ తనదైన మేకింగ్ స్టైల్‌ను చూపించారు. కామెడీ, ఎమోషన్, థ్రిల్ అంశాలను డిఫరెంట్ స్క్రీన్‌ప్లేతో కలిపి చెప్పడం ఆయన శైలి. ఇప్పుడు రవితేజతో చేయబోయే సినిమాలోనూ అదే తరహా కొత్తదనాన్ని చూపించేందుకు ప్రయత్నిస్తున్నారట. ఈ ప్రాజెక్ట్‌ను సాధారణ మాస్ యాక్షన్ మూవీకి భిన్నంగా హారర్ కామెడీ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కించనున్నారనే ప్రచారం జరుగుతోంది. రవితేజ ఇప్పటివరకు కామెడీ, యాక్షన్, మాస్ ఎంటర్‌టైనర్ సినిమాల్లో తన ఎనర్జీతో ఆకట్టుకున్నారు.ఈ ప్రాజెక్ట్ హారర్ కామెడీ థ్రిల్లర్‌గా ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. ఇక సినిమా టైటిల్ పై కూడా చర్చ జరుగుతోంది. ఈ సినిమాకు 'తులాభారం' అనే టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నారట. అచ్చ తెలుగు పదంతో ఉన్న ఈ టైటిల్ వినడానికి చాలా డిఫరెంట్‌గా ఉండటంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. అయితే 'తులాభారం' టైటిల్‌ను చిత్రబృందం అధికారికంగా ఖరారు చేసిందా లేదా అనే విషయంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. వివేక్ ఆత్రేయ గత సినిమాల టైటిల్స్ కూడా కథకు డిఫరెంట్ గుర్తింపును తీసుకొచ్చాయి. ఇప్పుడు రవితేజ లాంటి మాస్ హీరో సినిమాకు 'తులాభారం' అనే టైటిల్ పెట్టడం వెనుక కథలో ఏదైనా స్పెషల్ కాన్సెప్ట్ ఉందా? అనే చర్చ మొదలైంది. ఫిల్మ్ నగర్ వర్గాల టాక్ ప్రకారం.. ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని తెలుస్తోంది. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు కొనసాగుతున్నట్లు సమాచారం. అన్నీ అనుకున్నట్లు జరిగితే దసరా సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌ను పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది. నిర్మాణ సంస్థ, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు, షూటింగ్ షెడ్యూల్ వంటి వివరాలపై మాత్రం ఇంకా అధికారిక సమాచారం రావాల్సి ఉంది. ఇటీవల 'ఇరుముడి'తో రవితేజ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్నారనే ట్రేడ్ టాక్ నేపథ్యంలో.. ఆయన తదుపరి సినిమాలపై అంచనాలు పెరిగాయి. ఇప్పుడు వివేక్ ఆత్రేయతో హారర్ కామెడీ థ్రిల్లర్ చేయనున్నారనే వార్త ఆ ఆసక్తిని మరింత పెంచుతోంది. రవితేజ మార్క్ ఎనర్జీ, కామెడీ టైమింగ్‌కు వివేక్ ఆత్రేయ డిఫరెంట్ స్క్రీన్‌ప్లే తోడైతే సినిమా ఎలా ఉండబోతుందనే ఆసక్తి నెలకొంది. ఈ ప్రాజెక్ట్ పై మూవీ మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వస్తే మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



# ఓటీటీలో ట్రెండ్ అవుతోన్న రేణూ దేశాయ్ 'కాశీ మజిలీ'



సాధారణంగా కాశీ వెళ్లొచ్చిన వాళ్లు.. "కాశీలో అది వదిలిపెట్టాం, ఇది వదిలిపెట్టాం" అని చెబుతుంటారు. కానీ దర్శకుడు యమునా కిశోర్ గారు కాశీని చూసిన కోణం చాలా లోతైనది. "కాశీ మన నుంచి ఏమీ తీసుకోదు.. మన గుండెల్లో ఉన్న బాధను మాత్రమే తీసుకుంటుంది, తిరిగి మనకు స్వచ్ఛమైన సంతోషాన్ని ఇస్తుంది" అనే ఒక అద్భుతమైన తాత్విక థీమ్‌తో ఆయన కాశీ మజిలీ సినిమాను మలిచారు. మనిషి అంతరంగాన్ని ఆవిష్కరించే ఈ గొప్ప ఆలోచనే నేడు విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. తన 'డ్రీమ్ మర్చంట్స్' సంస్థ ద్వారా ఇప్పటివరకు 600కు పైగా అడ్వర్టైజ్‌మెంట్‌లను (యాడ్ ఫిల్మ్స్) రూపొందించిన అపారమైన అనుభవం దర్శకుడు డి. యమునా కిశోర్ గారి సొంతం. నిరంతరం గ్లామర్, హంగులతో కలర్‌ఫుల్‌గా ఉండే ఆ యాడ్ ప్రపంచం నుంచి కాసేపు బయటికి వచ్చి.. పూర్తిగా ఆధ్యాత్మిక వాసనలు గుబాళించేలా, మనసుకు హత్తుకునేలా ఈ సినిమా తీయడం ఆయనలోని అసలైన సృజనాత్మకతకు, వైవిధ్యానికి నిదర్శనం. రేణు దేశాయ్, శంకర్ ఇందుచూడన్ ప్రధాన పాత్రల్లో సహజమైన నటనతో ఆకట్టుకున్న ఈ సినిమా కోసం, దివంగత మహాకవి శ్రీ సిరివెన్నెల సీతారామశాస్త్రి గారు రాసిన ఒక అపురూపమైన పాటను ఉపయోగించారు. కథలోని ఆత్మను ప్రేక్షకుడి గుండెల్లోకి చేర్చడానికి సిరివెన్నెల గారి సాహిత్యాన్ని ఎంచుకోవడం, దానికి డా. జోశ్యభట్ల గారి సంగీతాన్ని జోడించడం యమునా కిశోర్ గారి ఉన్నతమైన సాహితీ, సంగీత అభిరుచికి అద్దం పడుతోంది. అద్భుతమైన కాశీ అందాలు, వాటిని తెరపై ఆవిష్కరించిన యమునా కిశోర్ గారి టేకింగ్, విభిన్నమైన ఒక ప్రేమ కథకు కాశీ ఆధ్యాత్మికతను జోడించిన తీరు ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ. ప్రతి ఫ్రేములోనూ కనిపించే యమునా కిశోర్ గారి తాలూకు విజువల్ ఆస్థటిక్స్ , ఫ్రేము ఫ్రేములోనూ తొణికిసలాడే ఆధ్యాత్మికత ఈ చిత్రాన్ని ఒక దృశ్యకావ్యంలా నిలబెట్టాయి. కళ్యూరి జగదీష్ కుమార్ నిర్మాణంలో, రాణా ఛాయాగ్రహణం, మీర్ కూర్పు తోడవ్వగా.. దర్శకుడు డి. యమునా కిశోర్ గారి బహుముఖ ప్రజ్ఞకు, ఆయన క్రియేటివ్ విజన్‌కు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిన ఈ 'కాశీ మజిలీ' ఇప్పుడు విమర్శకుల ప్రశంసలు